# విక్రమోర్వశీయము

## కాళిదాస కృతి

ఆంధ్రీకృతి

డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

**ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.**

**ఫోన్ నెంబర్ : 9440495887,9866115177**

**VIKRAMORVASEEYAMU**

(Original – Sanskrit Drama by Kalidasa)

Telugu Translation by **Dr.Nanduri Ramakrishnamacharya**

ప్రథమ ముద్రణ : 1952

ద్వితీయ ముద్రణ : 1968

తృతీయ ముద్రణ : 1985 (4000 ప్రతులు )

అంతర్జాలము పర్య వేక్షణ (Web) : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084. Cell -9440495887.

: 2. నండూరి విద్యారణ్య స్వామి , ప్లాట్ నం .:154,
స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ, నిజాం పేట
హైదరాబాద్ -500090. Cell -9391028231 .

వెల : రూ.80/-.

సర్వ హక్కులు : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

(Copy Rights Reserved by Nanduri Ramakrishnamacharya Sahitya Peetham)

# విక్రమోర్వశీయము

## నాంది

వేదాంతమ్ము వచించు విశ్వమయుఁ డే విశ్వేశుఁ డేకైకుఁడై
యాథార్థ్యమ్ముగ నీశ్వ రాఖ్యకును నన్వర్థుండో యధ్యాత్మ సం
వేముల్ భక్తులు యోగమార్గమున నిన్వేషింతు రే స్థాణుకై
యా దేవుండె యొసంగు మీ కెపుడు సర్వైశ్వర్య మోక్షమ్ములన్.

నాఁద్యంతమున

సూత్రధారుఁడు :- (తెర వైపునకు జూచి) ఇటు రమ్ము - మారీషా

మారీషుఁడు :- ఇదిగో వచ్చినాను.

సూత్ర :- పారిషదులకుఁ బూర్వకవి ప్రయోగబంధము లనేకము లవహిత బూర్వములే. కావున నేఁడు విక్రమోర్వశీయమను నపూర్వ నాటకము ప్రయోగింప వలయును. అందుచేఁ బాత్రవర్గమంతయు నెవరి భూమికలలో వారు సంసిద్ధులై యుండవలె నని చెప్పుము.

మారి :- బావ యాజ్ఞ నెరవేర్చెదను (నిష్క్రమించును)

సూత్ర: - పారిషదులైన యార్య మిశ్రు లందఱకు నా విజ్ఞాపన. ప్రీతి మాయందుఁ బూనుటచేతనైనఁ గావ్యనాయకుని యెడల గౌరవమున నై నఁ గాళిదాసకృతి యటంచు నైన నీప్రయోగమ్ము మది నాదరింపుఁడయ్య,

(తెరలో) రక్షింపుఁడు ! రక్షింపుఁడు ! సురపక్షపాతశీలులు గాని యాకాశ గమనశాలులు గాని యెవ్వ రైన రక్షింపుడు!

సూత్ర:- (చెవియొగ్గి) . నా విజ్ఞాపనానంతర మాకాశమునుండి యీ శబ్ద మేమి? కురరీ నినాదమువలె వినిపించు చున్నది. అవును- తెలిసినది!

ముని నారాయణ దేవు నూరువున నంభూత మ్మ పూర్వాప్సరో
మణి కైలాసనివాసు వీడ్కొని తిరోమార్గంబు నందుండగా
గొనె రక్షోవిభుఁ డామె బందిగను నాక్రోశించుచున్నారు ద్యో
వనితావర్గము చెంతనుండి శరణాపన్న ప్రలాపమ్ములన్

-ప్రస్తావన- (నిష్క్రమణము)

**(అప్సరసలు ప్రవేశము)**

అప్సరసలు :- రక్షింపుఁడు! రక్షింపుఁడు! సురపక్షపాతశీలులుగాని యాకాశ గమనశాలులు గాని రక్షింపుఁడు!

(ప్రవేశము : అపటి క్షేపముగా రాజు పురూరవుఁడు: రథముతో సూతుడు.)

రాజు ; - ఆక్రందన మేమి? సూర్యోపాసన సల్పివచ్చుచున్న యీ పురూరవు జేరుడు. ఎవరివలన భయము ?

రంభ:- రాక్షస విజృంభణమువలన

రాజు :- రాక్షస విజృంభణమా ? మీ కేమి యపరాధము జరిగినది ?

రంభ - మహారాజా ! వినుము.

ఎవతె తపోభీరువైన మహేంద్రునకు సుకుమారకోమలాయుధ మో యెవతె రూపగర్వితయైన శ్రీదేవికి ప్రత్యర్థినియో, యెవతె స్వర్గలోకమునకే యలంకారమో యా మా ప్రియసఖి యూర్వ శిని కుబేరాస్థానము నుండి తిరిగివచ్చునపుడు చిత్రలేఖతో గూడ హిరణ్యపురవాసియైన కేశిదానవుఁడు మార్గ మధ్యమున నాకస్మికముగఁ జెఱఁబట్టినాఁడు.

రాజు : - ఆ జాల్మ డేదిక్కుగాఁ బారినాఁడు ?

సహజన్మ :- పూర్వోత్తరదిశగా.

రాజు : - విచారింపకుఁడు - మీ సఖులను మీతోఁ జేర్చుటకుఁ బ్రయత్నించెదను.

అందఱు ;- ఇది సోమపౌత్రునికే తగినది.

రాజు :- మన మెచ్చట తిరిగి కలిసికో వచ్చును ?

అంద :- హేమకూట శిఖరమున.

రాజు :- సూతుఁడా ! ఈశాన్యమునకు నశ్వముల వేగముగాఁ దోలుము.

సూతు ; ఆయుష్మంతుని యాజ్ఞ. (అని చెప్పినట్లు చేయును)

రాజు : (రథ వేగము నిరూపించి)

బాగు ! బాగు! ఈ రథ వేగముతో ముందు బయలు దేరిన గరుత్మంతుని గూడ నధిగమించవచ్చును. ఇక రాక్షసుని మాటయేల ?అవును.

విడివడి తేరిక్రిందఁ బడి విచ్చెడి మబ్బులు దుమ్ము దుమ్ముగన్
వడి చనఁ దోచుఁ జక్రపరివర్తన నాకులమధ్య నాకు లున్
దడబడకుండఁ గట్టి తలఁద్రాల్చెఁ బతాకము గాలి నీవఁ గ
న్పడు బలె! బొమ్మలో వలెను వారువముల్ తల చామరమ్ములున్

(నిష్క్రమణము, రథముతో రాజు, సూతుఁడు.)

రంభ :- అప్పుడే రాజర్షి నిష్క్రమించినాఁడు మనముకూడ నిర్ణీత ప్రదేశమునకుఁ బోవుదము రండు.

మిగిలినవారు;- అటులనే

(అని శైలారోహణము నభినయించుచు నిలిచెదరు)

రంభ ;- ఆ రాజర్షి మన హృదయబాధ నపనయించునా ?

మేనక;- సంశయ మేమియు లేదు మహేంద్రుడే సంగరారంభమున నీ మహారాజును మధ్యమలోకమునుండి సబహుమానముగా నాహ్వా నించి విజయసేనాధిపత్యమునకు బట్టము గట్టును.

రంభ ;- సర్వవిధముల నితనికి విజయము సిద్ధించు నని తలపోయు చున్నాను.

మేనక ; - (ఇంచుక యాగి) ఊరడిల్లుము - ఊరడిల్లుము, అదిగో! ఉచ్ఛ్రితిత హరిణకేతనాంచితమైన రాజర్షి రథము సోమద త్తము. కృతార్థుడుగాక తిరిగి రాడు గదా !

(అందరు ఉన్న యనులై విలో కింతురు)

(ప్రవేశము : అంతట రథారూఢుడు రాజు. సూతుడు చిత్రలేఖను బట్టు కొని భయముచేఁ గన్నులు మూసిన ఊర్వశి)

చిత్రలేఖ ; – ఊరడిల్లుము ప్రియసఖీ !

రాజు ;- ఊరడిల్లుము.

భయమును వీడు, రాక్షసుని బాధ తొలంగెను సుందరీ! జగ
త్ త్రయమును వజ్రి సంతతము రక్షణ చేయుచు నుండె, విప్పు నీ
నయన యుగిన్ మిటారి చిరునవ్వులతోడ, నుషస్సులన్ సదా
వయసు వగల్ వెలార్చు నవపద్మిని పువ్వుల రేకులంబలెన్..

చిత్ర ; - ఏమి ? ఉచ్ఛ్వాసము మాత్రమే జీవలక్షణముగా గల యీమె యింకను దేరుకొనుటలేదే !

రాజు ;- పాపము మిక్కిలి భీతి చెందినది.

కుసుమకోమలి నిశ్వాసగుంఫనములు

వీడ లేకుండె నిప్పుడు భీతిచేత

గుండె దడదడ నాగక కొట్టుకొనగ

జారసాగిన దదె హరిచందనమ్ము.

చిత్ర; - సఖీ...ఊరడిల్లుము ఏమిది నీ వప్సరసవలె బ్రవర్తించుటలేదు.

(ఊర్వశి తేరుకొనును)

రాజు ;- (హర్షముతో) చూడుము - మీ ప్రియసఖి తేరుకొనుచున్నది

వెన్నెల గ్రమ్ము జీకటుల వీడు నిశాంగనవోలె, రాత్రి పై

నున్న పొగల్ గతింప గడు నుజ్జ్వల మయ్యెడి జ్వాల పోలికన్

తిన్నగ లేని గట్లు తెగి తేరి స్రవించు స్రవంతివోలె నీ

యన్నుల మిన్న తేరుకొని యందము చందము చిందుచుండెడిన్.

చిత్ర ;- సఖీ ! ప్రసన్న నగుము. త్రిదశారులు పరాభూతులైనారు

ఊర్వశి;- (కనులు విప్పి) క్రాంతదర్శి మహేంద్రుని ప్రభావమువలననా ?

చిత్ర ;- మహేంద్రునివలనగాదు గాని మహేంద్ర సదృశుడైన యీ పురూరవ మహారాజువలన.

ఊర్వ ; - (రాజును గాంచి- ఆత్మగతము) దానవు లెట్టి యుపకారము చేసినారు.

రాజు :- (తేరుకొనిన యూర్వశిని జూచి ఆత్మగతమున) నారాయణ మహర్షిని వలపింపఁజూచిన యప్సరస లందఱు నతని యూరు సంభవమైన యీ యూర్వశిని జూచి సిగ్గిలుట సహజమే కాని యీమె తాపసి సృష్టి యనుటకు వీలు లేదు.

చలువ వెలుంగు వెల్లి దొర చంద్రుడొ! యామని పూల సామియో

వలపుల రేడొ యీ లలన భావనచే సృజియించియుండుఁ బ్రా

బలుకుల వల్లెవేసెడి యెవండో మునీశ్వరు డెండు గుండెతో

జెలువము చిమ్ము నీ కలికి సిగ్గుల మొగ్గను సృష్టి చేసెనా?

ఊర్వ;- ఇప్పుడు సఖీజన మెచ్చట నున్నారో కదా !

చిత్ర ;- అభయప్రదాత మహారాజునకే తెలియవలెను.

రాజు ;- (ఊర్వశిని జూచుచు) మహావిచారములో మునిగియున్నారు. చూడవచ్చును.

సుందరీ ! నిన్ను నొకసారి చూచినంత

వీడలేకుండ నే నిట్లు వేగుచుండ

నార్ద్ర సుకుమారమతులు సదానుసరులు

చెలుల మాట వేఱుగ నొక్కి చెప్ప నేల ?

ఊర్వ ;- (ఆపవారించి) ఆభిజాత్యమునకు దగిన వచస్సు. చంద్రునినుండి యమృతము స్రవించుటలో నాశ్చర్య మేమున్నది! అందుచే నతని జూచుటకే నా హృదయ ముర్వీళ్ళూరుచున్నది.

రాజు; - (చేతితో జూపి)

హేమకూటముపైనుండి యిందువదన

నీ ముఖము చూచుచున్నారు నెచ్చెలు లదే

గ్రహణమోక్షము గాంచుటఁ గాంతి తేరు

చంద్ర బింబమ్ముఁ జోలి ప్రసన్న మగుట.

చిత్ర ; - చూడుము సఖీ !

ఊర్వ ; - (రాజును సాభిప్రాయముగాఁ జూచును) సానుభూతితో నా నయ నములతోఁ దాతాత్మ్యము చెందుచున్నట్లున్నది.

చిత్ర ;- ఎవరు సఖి ?

ఊర్వ :- మన సఖీ జనమే.

రంభ ;- (హర్షముతో) మహారాజు చిత్రలేఖతో గూడిన యూర్వశిని వెంటబెట్టుకొని విశాఖా నక్షత్రయుక్తచంద్రునివలె వచ్చుచున్నాడు.

మేనక;- (నిరూపించి) ఉభయతారకమైనది మన ప్రియసఖి లభించినది. మహారా జక్షత శరీరుడై మగిడి వచ్చినాడు.

సహజన్మ:- నిజము చెప్పుము. దానవులు సులభసాధ్యులు గారు గదా

రాజు ;- సూతుడా ! ఇదిగో - ఆ శైల శిఖరము. రథము దింపుము

సూతు:- ఆయుష్మంతుని యాజ్ఞ. (అని అట్లు చేయును)

రాజు : - (చక్రోద్ఘాతము నిరూపించి) ఎగుడు దిగుడుగా రథ మాగుట కూడ మంచికే వచ్చినది

ఆరదవుఁ గుదుపుచే నా భుజా గ్ర మా మె
భుజము ఢీకొని రాపిడి పొంది నపుడె
యుద్భవించెను రోమాంచ మొడలు నిండ
వలపు తలపులు మనసులో మొలిచినట్లు

ఊర్వ: - సఖి ! కొంచెము ప్రక్క కొదుగుము

చిత్ర :- (చిరునవ్వుతో) వీలు లేదు.

రంభ :- సఖులారా ! రండు. ఈ రాజర్షి కభివాదము లర్పించుదము.

(అందఱు సమీపించెదరు)

రాజు -: సూతుడా ! రథము నాపుము.

తిరిగి చూడగఁ గోరి ప్రతీక్షతోడ
వేగి వేసారి యుత్కంఠ వేచియుండు
చెలులు నీ కుటిలభ్రువు చేరు గాత!
లతల ఋతుశోభ చేరెడి గతిని నేడు

(సూతు డట్లు చేయును)

అప్సరసలు:- విజయముచే వర్ధిల్లు మహారాజున కభివాదాలు !

రాజు :- సఖీసమాగమముతో మీరు కూడ నట్లే!

ఊర్వ;- (చిత్రలేఖ చేయి నూతగాఁగొని రథము దిగి) సఖులారా ! గాఢముగాఁ గౌగిలింపుడు. తిరిగి సఖీ జనుల గలిసికో గల నని యనుకోలేదు.

(సఖులు గాఢముగా గౌగిలించెదరు)

రంభ :- శతకల్పములు మహారాజు పుడమి నేలు గాత,

సూతు :- ప్రాచ్యదిగ్భాగమునుండి రథశబ్దము వినుపించుచున్నది.

ఆకసమునుండి యెవ్వరో యద్భుతముగ
నవతరించెడి శైలశిఖా గ్రమునకు
మెరుపుతో గూడి చనుదెంచు మేఘము వలె
కనక భుజకీర్తులు మెరుగు కాంతులీన

(అప్సరసలు చూచెదరు)

అందరు :- ఓహో ! చిత్రరథుడు !

(చిత్రరథుడు ప్రవేశము)

చిత్రరథుడు :- ( సబహుమానముగా రాజును వీక్షించి) మ హేంద్రోపకారివి కాగల విక్రమమహిమచే వర్ధిల్లుచున్న రాజా ! జయము.

రాజు : - ఓహో ! గంధర్వరాజు ! (రథము దిగి) ప్రియమిత్రునకు స్వాగ తము (పరస్పర హస్తస్పర్శ కావింతురు)

చిత్రర :- కేశిదానవుఁ డూర్వశిని హరించిన వృత్తాంతము నారదునివలన విని దేవేంద్రుడు గంధర్వసేనను బుత్తెం చి నాడు. అంతలో నీ జయోదాహరణము చారణులవలన విని యిటు నీ దగ్గరకు వచ్చినాను. కావున నీ వామెను వెంటనిడుకొని నాతో మహేంద్రు సందర్శించుట మంచిది. మహేంద్రునకు నీవు చేసిన మహోపకార ముగ్గడింపఁదగినది. చూడుము

ఎపుడొ నారాయణ మహర్షి సృష్టి చేసి
దేవతల కిచ్చె నీమెను దీప్తి యెసగ;
తిరిగి యీమెను నే డీవు తెచ్చి యిచ్చి
నావు మాకు దానవక రాంతరమునుండి

రాజు ;- కాదు. ఇందులో నే జేసిన దేమి ?

ఇయ్యది సమస్త మరయ దేవేంద్రుమహిమ
కాదె! పరపక్ష విక్షేపకారణమ్ము

సింహగర్జన మత్తేభ శేఖరముల

మాపుచేయదే గుహలలో మారు మ్రోగి.

చిత్ర :- ఇది యుక్తమే. వినయము విక్రమాలంకారము గదా !

రాజు :- ఇది దేవేంద్రుని చూచుట కవసరము కాదు. మీరే యామె నతని సన్నిధి చేర్పుడు.

చిత్రర!- అయిన నీ యిష్టము - మార్గ మిది .

(అప్సరసలు పయన మయ్యెదరు)

ఊర్వ !- (జనాంతికము) సఖీ ! చిత్రలేఖా ! ఉపకృతి పొందిగూడ మహారాజును వీడ్కొన లేకున్నాను. నా పక్షమున నీవు పలుకుము.

చిత్ర! - (రాజును సమీపించి) మహారాజా ! ఊర్వశి విజ్ఞాపన యిది.

"మహారాజు ననుజ్ఞ వడసి మహారాజు కీర్తిని ప్రియసఖివలె సురలోకమునకుఁ గొనిపో గల"నని చెప్పుచున్నది.

రాజు !- పునర్దర్శనమగు గాక. వెడలిరండు.

(అందఱు గంధర్వులు నాకాశయానము నభినయించెదరు)

ఊర్వ !- (యానభంగము నభినయించి) లతావిటపమున నా యేకావళి చిక్కుపడినది (రాజు నా మిషతో (జూచుచు) చిత్రలేఖా, చిక్కు విడదీయుము

చిత్ర !- (చిరునవ్వుతో) దృఢముగాఁ జిక్కుకొన్నది. విడిపడునట్లు లేదు. అయినను బ్రయత్నించెదను

ఊర్వ!- (నవ్వి) సరే యీ మాటలు మరువవద్దు. (చిత్రలేఖ విడదీయుట నభినయించును)

రాజు - (స్వగతము)

ఓ లతామతల్లీ నాకు నుపకరించి

నావు క్షణమైన ప్రేయసి నడకనాపి

కలికి క్రీగంటి చూపులు చిలుకునట్టి

యా వగలమారి యరమొగ మరిసినాను.

సూతు;- ఆయుష్మంతుడా!

అమరపతి కెగ్గు చేసిన యసురపతుల
నెల్ల లవణాంబునిధిలోని కీడ్చి త్రోసి
యమ్ముల పొదిలోఁ జేరె వాయ్వ్యస్త్ర మిదిగో
పుట్ట లోన జేరిన పాముఁ బోలి యిపుడు,

రాజు :- రథము చేరువకు దెమ్ము

(సూతు డట్లు చేయును. రాజు నాట్యముతో రథము నెక్కును. నిట్టూర్పులతో రాజును జూచుచు నూర్వశి, సఖులతోఁ జిత్రరథునితో నిష్క్రమణము)

రాజు : - (ఊర్వశి మార్గమువైపు దృష్టిసారించి) మదను డసాధ్య విషయములపై మక్కువ నెట్లు ప్రేరేపించునోగదా !

ఈ సురాంగన మింటికై యెగసినపుడు
నా శరీరమునుండి మనస్సు నూడ
దీసెఁ దెగినట్టి తామర తీగెనుండి
పోగులను రాజహంసిక లాగునట్లు.

**—విక్రమోర్వశీయము ప్రథమాంకము —**

**ద్వితీయాంకము**

(విదూషకుడు ప్రవేశించును)

విదూషకుడు :- రాజరహస్యము దాచుటకు, నా నాలుకను, నిమంత్ర ణీకుడు పరమాన్నము నెడవలెఁ గట్టకొన లేకున్నాను. అందుజేఁ బది మందిలో నుండక పూజ్య వయస్యుడు ధర్మాసనము నుండి లేచి వచ్చువరకు జన విరళమైన విమాన పరిచ్ఛంద ప్రాసాద పరిసరములఁ దిరుగు చుండెదను.

(చేటి ప్రవేశము)

చేటి :- "నిపుణికా, ఆర్య పుత్రులు సూర్యోపస్థానము సలిపి తిరిగి వచ్చి నప్పటి నుండియు శూన్య హృదయునివలె గోచరించు చున్నారు. కావున వారి ప్రియ వయస్యుఁడైన యార్యమాణవకుని నుండి. యుత్కంఠా కారణము దెలిసికొని రమ్మ"ని దేవి కాశీ రాజపుత్రి యాజ్ఞ. కాని ఆ బ్రహ్మ బంధుని దగ్గర నుండి యీ విషయ మును లాగుటెట్లు ? కాని. చిరు గడ్డి పోచచివర నుండు మంచు బొట్టువలె రాజరహస్య మీతని నాలుక పై నెంత కాలము నిలచి యుండఁ గలదు? ఇతని నన్వేషించెదను గాక. (పరిక్రమించి) ఇదిగో ! ఆర్య మాణవకు డిచ్చటనే చిత్రాకృతినున్న వానరము వలె నున్నాడు. ఈ య సాధారణ తూష్ణీంభావ మెందులకో ! అతని సమీపించెదను (సమీపించి) ఆర్యా ! వందనము.

విదూ ;- స్వస్తి ! (ఆత్మగతము) ఈ దుష్ట చేటినిఁ జూడగనే రాజ రహస్యము హృదయము ఛేదించుకొని పైన కుబుకు చున్నది.

(ప్రకాశముగా) సంగీత పారాయణము నుజ్జగించి యెటకు వెళ్ళుచుంటివి నిపుణికా ?

నిపు :- దేవి యనుశాసనము ననుసరించి నీ కొఱకే వచ్చు చున్నాను.

విద - అయిన దేవి యాజ్ఞ యేమి?

నిపు :- నీ వెప్పుడు దేవియందే పక్ష పాతను గలిగి, యామె యనుచిత వేదన పొందుట సహింపవని చెప్పు చున్నారు.

విదూ :- (సవితర్కముగ) ఏమి ? ప్రియ వయస్యుడు దేవి కే యప్రియ మాచరింప లేదు గదా ?

నిపు :- రాణి గారిని, రాజుగా రేమరుపాటునఁ దాను వలచియున్న స్త్రీపేరుతో పిలచి నారట.

విదూ :- (స్వగతము) పూజ్య మిత్రుడు స్వయముగనే తన రహస్యము బట్ట బయలు చేసి కొనినాడు. ఇంక నా నాలుక పెకలకుఁడ నే బాధ పడుట యనవసరమే.

(ప్రకాశముగ) ఏమి? దేవిని "ఊర్వశీ !" అని పిలచి నాడా ? ఆ యప్సరసను జూచినప్పటి నుండి, వినోద

విముఖుడై, పిచ్చివాడైపోయి, దేవినే గాదు నన్ను గూడ వేధించు చున్నాడు.

నిపు :- (ఆత్మగతము) రాజ రహస్య దుర్గ విచ్ఛేదనము గావించితిని.

(ప్రకాశముగ) ఆర్యా ! దేవి కేమని విన్న వింతును ?

విదూ:- నిపుణికా ! వయస్యుని నెండమావుల వెంబడింపకుండ వెనుకకు మరలునట్లుచేసినఁ గాని దేవి ముఖము చూడనని చెప్పుము.

నిపు ;- ;- ఆర్యుని యాజ్ఞ పాటించెదను. (నిష్క్రమణము)

(తెరలో వై తాళికుడు)

జయము జయము దేవరకు

లోకబంధు తమంబు బాపి వెలుగుల్ గూర్పంగ నౌ నీకు నా

లోకజ్యోతికి ధర్మ మొక్కటియె యాలోకింప రాజో త్తమా !

యాకాశంబున మధ్యభాగమున మార్తాండుం డధిష్ఠిఁ చెడిన్

నీకున్ పష్ఠవిభాగమౌ దివసమందే స్వేచ్ఛ వొందఁదగున్,

విదూ:- (చెవియొగ్గి) ప్రియ వయస్యుఁడు ధర్మాసనము నుండి లేచి యిటే వచ్చు చున్నాడు. అతని గలిసి కొనెదను. (ప్రవేశకము)

(అంతట నుత్కంఠితుడైన రాజు, విదూషకునితో బ్రవేశించును.)

రాజు :- అమర సుందరి నా హృది నధివసించె

జూచి నప్పటి నుండియు సుక్కుచుంటి

సుమశరున కెట్టి లక్ష్య సంశుద్ధి కలదొ

తూట్లు పడిపోయి నా గుండె తూలుచుండె.

విదూ:- (ఆత్మగతము) పాపము, కాశీరాజపుత్రి యూరాటపడుట సహజమే!

రాజు :- నా రహస్య నిక్షేపము సంరక్షించు చున్నావు గదా?

విదూ:- (ఆత్మగతము- సవిషాదముగా) అయ్యో ! అయ్యో! ఆ దుష్ట దాసి నన్ను వంచించినది. లేనిచో వయస్యుడీ విధముగా బ్రశ్నించునా !

రాజు :-(శంకతో) నీ వేల తూష్ణీంభావము వహించుచున్నావు?

విదూ :- నీకు గూడ బ్రతివచన మీయకుండ నా నాలుక కట్టుకొని యున్నాను.

రాజు :- బాగున్నది. ఆత్మ వినోద మెట్లు కలుగును ?

విదూ :- వంట యింటికే బోవుదము రమ్ము.

రాజు : - ఏమున్న దక్కడ ?

విదూ :- అక్కడఁగల పంచవిధ భోజ్యములు, సమస్త సంభారములు  చూచిన నీ విరహోత్కంఠ మరచిపోయి వినోదింప గలవు.

రాజు :- (సస్మితముగ) నీ యీప్సిత సన్నిధానమున నీ కానందము కలుగును. కాని దుర్లభ కాంక్షతో దూగాడు చున్న నాకెట్లువినోదము గలుగును ?

విదూ :- పూజ్యురా లైన యూర్వశి నిన్నుఁ జూచి యున్నదా?

రాజు :- అయిన నేమి?

విదూ :- అయిన, దుర్లభ మని నే ననుకొన జాలను.

రాజు :- అది నీకు నాయందు గల పక్షపాతము.

విదూ :- నీ మాటల వలన నా కౌతూహల మతిశయించినది. కురూపతకు నన్ను, సురూపత కూర్వశినిఁ జెప్పవలెనా యేమి ?

రాజు :- ప్రత్యంగి  వర్ణన సలుప నాతరము గాదు. నా సమష్టి సమీక్ష విను

ఆభరణములకే యామె యాభరణము
సరస సౌందర్య విధికిఁ బ్రసాధనమ్ము
నుపమలకు సరిపోలు బ్రత్యుపము యౌచు
నంద చందాలతో నామె యతిశయిల్లు...

విదూ :- అయిన నీవు దివ్యరసానుభూతికై చాతక ప్రతదీక్షపరిగ్రహించితి వన్న మాట.

రాజు :- విరహోత్సుకునకు వివిక్తమే శరణ్యము. ప్రమదవన మార్గముఁ జూపుము.

విదూ ;- (ఆత్మగతము) ఇంక గతి యేమి ?

(ప్రకాశముగ) ఇదె యిదె మార్గము (పరిక్రమించి) ప్రమదవనోదితమైనట్లు దక్షిణ మారుత మిదె వీచుచున్నది.

రాజు :- (విలోకించి) మారుతమునకీ విశేషణ ముపపన్నమే

మాధవీలతలతో గూడి మమతఁ జూపి

కుందనాట్య విలాసముల్ కులుక నేర్పి

స్నేహ దాక్షిణ్యముల్ ప్రదర్శించినాఁడు

వాయు దేవుండు దక్షిణ నాయకుండు

విదూ ;- నీ యభినివేశ మిట్టిదే యగు గాక. (పరిక్రమించి) ఇదిగో ! ప్రమదవన ద్వారము. ప్రవేశింపుము.

రాజు ;- ముందు నీవు ప్రవేశింపుము (ఉభయులు ప్రవేశిచెదరు)

రాజు :- (దృష్టి సారించి) ప్రమదవన ప్రవేశము సంతాప హరమని తలఁచుట పొరపాటయినది.

తాప శాంతిక యి యుద్యానవనమ్ము జేర

నేటి వాలుకు నెదురీదు నట్లయ్యె

విదూ ;- ఏ మట్లంటివి ?

రాజు ;- హృదయ మలభ్య యోగ మనియెంచక యచ్చర పైఁజనెన్ గదా

మదనుఁడు పుష్ప బాణమహిమమ్మును జుపుచునున్నవాఁడు చ

ల్లదనము కమ్మతెమ్మెరల లాస్యము పండిన యాకు రాల్చి కెం

పొదవిన గున్న మావి చిగు రూరట కల్పన చేయఁజాలునా ?

విదూ :- ఈ పరిదేవనము చాలింపుము. ఆ మదనుఁడే త్వరలో నీ కభీష్ట సంసిద్ధి గల్పించి సుఖ ప్రదాత కాగలడు.!

రాజు :- బ్రాహ్మణ వచనము పరిగ్రహించుచున్నాను. (ఉభయులు పరి క్రమింతురు)

విదూ ;- ప్రమదవనము వసంతోదయమున సోంపులు గుల్కుచున్నది చూడుము.

రాజు ;- అవును. అడు గడుగునకుఁ గనుపించుచునే యున్నది

కురవక పుష్ప మంగనల గోళ్ళను జోలుచు నగ్ర భాగ మం

దెరుపుగ మారె రాగము వహించె నశోకము విచ్చ బోవుచున్.

చిరు నును పూవు గుత్తులను జిమ్మెను బుప్పొడిదుమ్ము మావి చే

ట్లర నెఱ సోయగమ్ములను నార్తవ శోభ రహించె ముగ్ధతన్ -

విదూ ;- మణిశిలా పట్టక ముతోనున్న యతి ముక్తాలత తుమ్మెదలు రాల్చిన పూవుటెత్తులతో స్వాగతమిచ్చు చున్నట్లున్నది. ఆనుగ్రహింపుము.

రాజు - నీకు రుచించినట్లే కానిమ్ము. (పరిక్రమించి యుపవిష్టులగుదురు)

విదూ;- ఇచ్చట సుఖాసీనుఁడవై లలిత లతా విలోకనమున నూర్వశీ విరహము నపనయించు కొనుము.

రాజు :- (నిట్టూర్చి)

విచ్చిన విరులతో విటపాల తోడ

పచ్చగ వికసించు వనలతా తతుల

నచ్చర పొడగన్న యక్షి యుగమ్ము

మెచ్చుకోఁ గలుగునా మెర మెచ్చులేల ?

కావున. నభీష్టసాధన కుపాయములు నిన్వేషింపుము

విదూ ; - (నవ్వుచు) అహల్యా కాముకుఁడైన యిందునకు వజ్రాయుధ మెంత యుపయుక్త మయ్యెనో నూర్వశీ విరహోత్కంఠుడవగు నీకు నేనంతియే.

రాజు ; - అట్లనకుము. అతిస్నేహము కార్యసాఫల్య మార్గము చూడఁగలదు.

విదూ:- తప్పు డాలోచించు చున్నాను. నీ వలపు గోలతో నాకు సమాధి బంగముఁ గా వింపకుము. (చింతాతన్మయత్వము నభినయించును)

రాజు :- (నిమిత్తము సూచించి) (ఆత్మగతము)

పూర్ణేందువదనను బొందంగ వశమె ?

వర్ణింప నౌనే యీ వలవంత? కాని

మానసమున ననుమానముల్ వోయెఁ

బ్రణయసిద్ధినిఁ బొందవచ్చు నిశ్చయము!

(అంతట నాకాశ యానమున నూర్వశి చిత్రలేఖయుఁ బ్రవేశము)

చిత్రలేఖ - ఈ యనిర్దిష్ట ప్రయాణ మెచ్చటికి ?

ఊర్వశి ;- సఖీ ! అప్పుడు హేమకూట శిఖరమున లతావిటపము నా యానభంగ మొనరించి నప్పు డపహసించితివి కదా! ఇప్పుడీప్రశ్న యేల?

చిత్ర:- ఏమి? రాజర్షి పురూరవ సందర్శనార్థమా యీ ప్రస్థానము ?

ఊర్వ; - ఆవును. సిగ్గు విడిచి యొప్పు కొను చున్నాను.

చిత్ర ;- ఎవరిని ముందుఁ బంపినావు ?

ఊర్వ:- హృదయమును .

చిత్ర :- ముందు బాగుగ నాలోచించు కొనుము.

ఊర్వ;- ఆలోచనకేమున్నది? మదనోద్వేగమిది

చిత్ర :- ఇఁక నేఁ జెప్పున దేమియు లేదు.

ఊర్వ:- ప్రియసఖి నిరంతరాయ మార్గము చూపుఁగాక

చిత్ర ;- సఖీ ! విస్రబ్ధవు గమ్ము, రాక్షసుల బారిఁబడకుండ మనకు దేవ గురు వపరాజిత యను పేరుగల శిఖాబంధన విద్య నుపదేశించెను గదా !

ఊర్వ; - ఆహ్ ! నా హృదయము సర్వము మరచినది.

(సిద్ధ మార్గమునకు దిగి)

చిత్ర :- గంగా యమునా సంగమ పావన సలిలముల యందు స్వీయ ప్రతి బింబము తిలకించు చున్నట్లున్న రాజర్షి ప్రాసాద మదిగో ప్రతిష్ఠాన నగర శిఖాభరణముగ వెలుగొందుచున్నది.

ఊర్వ: ఇది స్థానాంతర స్వర్గమని చెప్పనొప్పును. (ఆలోచించి) అయా పన్న ప్రసన్ను రెచ్చట నున్నాడో గదా?

చిత్ర:- చందన వనఖండమువలె నున్న ప్రమదవనములో దిగి తెలిసికొన వచ్చును (ఇద్దరు దిగుదురు)

చిత్ర; - (రాజునుజూచి హర్షముతో) ముందుదయించిన చంద్రుడు చంద్రిక కైవలె నీకై ప్రతీక్షించుచున్న మహారాజడుగో !

ఊర్వ:- (చూచి) సఖీ ! మహారాజు మొదటఁ జూచి నప్పటికంటె బ్రియ దర్శనుఁడుగ గన్పించు చున్నాడు.

చిత్ర :- ఆవును. అతని సమీపింతము రమ్ము.

ఊర్వ:- మహారాజు పార్శ్వవర్తియగు వయస్యునితో వివిక్తముగ మంతనము సల్పు చున్నాఁడు తిరస్కరణీ మహిమచే

నదృశ్యముగ నుండి వీరి సంభాషణ వినవలయును.

చిత్ర ;- నీ యిష్టము.

విదూ :- నీ దుర్లభ ప్రణయినీ సమాగమోపాయము నూహించితిని.

రాజు :- (మౌనము)

ఊర్వ:- ఏ స్త్రీ యీతని ప్రార్థన విని యూరకుండినది ?

చిత్ర :- ఏల మానుషత వహించు చున్నావు ?

ఊర్వ:- ప్రభావమువలన యదార్థము తెలిసికొనుటకు భయపడుచున్నాను.

విదూ :- నే నుపాయ మూహించితినయ్యా.

రాజు :- అయినఁ జెప్పుము.

విదూ :- స్వప్న సమాగమ కారణమైన నిద్రాసుఖమును బొందుము లేదా, ఊర్వశీ ప్రతిరూపము చిత్రరూపమున లిఖించి చూచి తృప్తిఁబొందుము.

ఊర్వ:- (సహర్షము) ఆల్పసత్వమగు హృదయమా ! శాంతించుము.

రాజు :- ఉదయము ననుపపన్నములే. ఏలన

హృదయము తూట్లు వారెఁ గుసుమేషు విజృంభణచేత, నింకెటుల్
నిదుర పటిల్లి స్వప్నమున నేఁ బ్రియురాలిని జూతు? ద్యోసఖీ
వదినము చిత్రరూపమున వ్రాయగఁ బూనినఁ గన్నులందుఁ జె
మ్మదనము నిండి దృష్టి మటుమాయము చేయు నీకేమి చేయుదున్?

చిత్రం:- సఖీ వినుచుంటివా ?

ఊర్వ: - విన్నాను - కానీ హృదయమున కింకను నూరట గల్గ లేదు.

విదూ:- నా శేముషీ విభవము కొలది చెప్పితిని.

రాజు :- ఆమె మహాప్రభావ మహిమాన్విత గాన నెరుంగకుండునా
మామక మానసవ్యధ ? సమాగమ మేలకొ యిచ్చగింపదా !

మామిడి పూల తూపు దొర, మాటికిఁ దీరని కోర్కి రేపి తా
నేమిటి పొందు ? నిట్టు లుడికించి కృతార్థత చెందు గావుతన్.

చిత్ర :- వింటివా చెలీ !

ఊర్వ:- అయ్యో! అయ్యో! న న్నపార్థము చేసికొనెనే. అతని కెదురువడి సమాధానము చెప్పలేను. ప్రభావ నిర్మితమైన భూర్జ పత్రమున నా యభిప్రాయ మెరిగించెదను.

చిత్ర:- అది నా కనుమతమే.

ఊర్వ;- (సంభ్రమముతో గ్రహించి యథోక్తము సల్పును)

విదూ :- (చూచి) రక్షింపుము ! రక్షింపుము ! నా ముందు పాము పడగ వలె నేదో పడినది.

రాజు : - (విభావించి) భూర్జ పత్ర గతమైన యక్షర బంధ మది

విదూ :- ఇది నీ పరిదేవన మదృశ్యముగ వినుచున్న యూర్వశి సమాను రాగ సూచకమైన ప్రణయలేఖ కాదు గదా !

రాజు:- మనోరథముల కందనిది లేదు. గ్రహించి (హర్షముతోఁజదువును) నీ యూహ సరియైనది.

విదూ :- ఇంక బ్రసన్నుఁడ వగుము. ఏది? ఆ లేఖ చదివి వినిపింపుము.

ఊర్వ:- బాగున్నది. ఎంతటి నాగరకుడవోయి !

రాజు ;- వినుము (చదువును)

ఏమని యెంచినావొ ! హృదయేశ్వర !నా మన సెన్నకుండగా
నామని వేల్పు తోట విరులందునఁ గ్రుమ్మరు కమ్మ తెమ్మెరల్
నా మెయి సోకి వెచ్చపడు నా నవపల్లవ పారిజాత శ
య్యామృదు రమ్య తల్ప విరహవ్రత నిశ్వసనానిలో ష్ణతన్.

ఊర్వ:- ఇప్పు డేమని పలుకునో.

చిత్ర :- కమల నాళము వలె నున్న యవయవములే చెప్పక చెప్పుచున్నవి.

విదూ;- అదృష్టవశమున నాకు స్వస్తి వాచనము లభించునట్లు నీ కూరట కల్గినది.

రాజు ;- ఊరట మాత్రమే గాదు

హృదయము విప్పి చెప్పి మదిరేక్షణ యీ ప్రియరమ్యలేఖలో
బొదిగె రసోచితమ్ముగ నపూర్వ మనోహర సౌకుమార్యముల్ ;
కదలెడి పక్ష్మమాల కడ కన్నుల నోయగ మెల్ల నామె నా
వదనము చేర్చి చింది నటు భావన చేసెద సంతసమ్మునన్.

ఊర్వ:- ప్రీతి మా యుభయులకు సమానమే.

రాజు :- అంగుళీ స్వేదముచే నక్షరములు చెరిగి పోవచ్చును. ప్రేయసీ లేఖను నీవు భద్ర పరచుము.

విదూ;- (గ్రహించి) ఊర్వశి నీ మనోరథములు పుష్పింపఁ జేసి ఫలింపఁజేయకుండునా ?

ఊర్వ;- పర్యుత్సుక మైన నాహృదయము తేరుకొను లోపల మహారాజు నకు ముందు నీ వగపడి యథోచితముగ సంభాషింపుము.

చిత్ర ;- (తిరస్కరిణి తొలగించి రాజును సమీపించి) జయము జయము మహారాజునకు !

రాజు :- (హర్షముతో) స్వాగతము—

గంగా యమునా లహరీ
సంగమ సందర్శభాగ్య సముపేతునకున్
గంగా విరహిత యమునయె
పొంగింపఁ గలదె హృదయము పుణ్యపురంధ్రీ.

చిత్రం :- మొదట మేఘరాజి అనంతరము విద్యుల్లత గదా కనిపించును!

విదూ:- (అపవారించి) ఏమి — యీామె యూర్వశి కాదా? ఈమె యూర్వశి నెచ్చెలి యేనా ?

చిత్ర :- ఊర్వశి మహారాజునకు నమస్కరించి చేయు విజ్ఞాపన.

రాజు :- ఆమె యాజ్ఞ వినిపింపుము.

చిత్ర : - ఆ నాడు రాక్షసుని నుండి మహారాజే కాపాడినాడు ఈనాడు కను పేదురు వలనఁ జిక్కి వలవంత కృశించు చున్నపుడుగూడ మహారాజే కృపఁ జూప వలసియున్నది.

రాజు :- భద్రముఖీ !

ప్రియసఖి సంతతమ్ము కనువేదురు తోడ సదా కృశించు చు

న్నయటు వచించుచుంటి విటు నా విరహార్తినిఁ జూడు, నీ ప్రియా

మయమున యందు మాయుభయమానసముల్ సరిగ్రాగె బాగుగా

నయము నయమ్ముతో నదుకు నగ్నినిఁ గ్రాగి తపించియుండుటన్

చిత్ర :- (ఊర్వశిని సమీపించి) రమ్ముఁ చెలీ. మదనుఁడు మహారాజునెడ నిర్దయతరుఁడగుటచే నే నాతని దూతికనై నీ కడకుఁ వచ్చితిని.

ఊర్వ:- (తిరస్కరిణి తొలగించి) ఎంతలో నీవు నన్ను వీడితివి !

చిత్ర :- ముహూర్త కాల మోపిక పట్టుము ఎవ రెవరి వీడుదురో తేలి పోవును.

ఊర్వ:- (సిగ్గుతో రాజును సమీపించి) జయము జయము మహారాజునకు !

రాజు : - జయ శబ్దవాదమ్ము సంతసం బయ్యె

హొయలుతో నీవు పేరొక్కని కనవు

జయ శబ్ద గౌరవ సామ్యా న నాకు

బ్రియసఖీ ! దేవేంద్రు పేర్మి దక్కినది.

(చేయి పట్టుకొని యాసీనను గావించును.)

విదూ ;- మహారాజు ప్రియ వయస్యుడనై న నాకీ యూర్వశి నమస్కరింప లే దేమి?

ఊర్వ:- (నవ్వుచు నమస్కరించును)

విదూ :- నీకు స్వస్తి యగుత !

(తెరలో : దేవదూత)

చిత్రలేఖా ! యూర్వశినిఁ ద్వర పెట్టుము

అప్సరస సంభరిత లలితాభినయము

భరత గురుదేవుని ప్రయోగ బంధనమ్ము

పారిషదులు సమస్త దిక్పతులఁ గూడి

చూడఁ గోరుచుండెను వేల్పు ఱేడు నేఁడు.

(అందఱు చెవియొగ్గుదురు. ఊర్వశి విషాదము నభినయించును)

చిత్ర :- ప్రియసఖి దేవదూత వచనము విన్నదిగదా! ఇక మహారాజును వీడ్కొన వలెను.

ఊర్వ:- నా నోట మాట వచ్చుట లేదు.

చిత్ర : - మహారాజా! ఊర్వశి పరాధీన. మహారాజనుజ్ఞ యిచ్చిన దేవ కార్యము నిర్వర్తించుట కేగవలయును.

రాజు :- (ఎట్లో పెదవి కదల్చి) మీ ప్రభు నాజ్ఞ కంతరాయము గల్గింప లేను. కాని నన్ను మరిచిపోఁ దగదు.

ఊర్వ: - (వియోగ దుఃఖము నభినయించుచు సఖితో నిష్క్రమించును)

రాజు :- (నిట్టూర్చి) నేఁడు కన్నులు నిష్ఫలము లైనవి

విదూ :- (భూర్జపత్రము చూపబోయి) ఇదిగో! ఇచ్చట (ఆర్ధోక్తితోనాగి) (ఆత్మగతము) అయ్యో ! ఆయ్యో ! ఊర్వశీ సందర్శన విభ్ర మమున భూర్జపత్రము ప్రమాదవశమునఁ జేతినుండి జారి పోవుట తెలియఁ జాలనై తిని.

రాజు : - భద్రుఁడా ! చెప్పఁబోవు చున్నా వేమి ?

విదూ :- నీ యనురాగము సడల నీయకుము. ఊర్వశికి నీయందు గాఢానురాగ మున్నది.

రాజు ;- నాకు నట్లే తోచుచున్నది. ఏలయన నామె వెడలునప్పుడు

గుండె దడదడ నాగక కొట్టుకొనఁగ

వేడి నిట్టూర్పులు విడిచి విడుచుచుండె!

ఇంతి హృదయమ్ము నామీద నిచట నుంచి

యవశమైన దేహమ్ముతో నచటి కరిగె.

విదూ ;- (ఆత్మగతము) భూర్జపత్రముమాటయెత్తునేమోనని క్షణక్షణమునకు నా మన స్సారాటము చెందుచున్నది.

రాజు :- నయనానంద మింకెట్లు కలుగును? సఖా ! ఆ భూర్జ పత్ర మిటుఁ దెమ్ము.

విదూ ; - (లేచి) ఇక్కడే యుండవలెను ఇక్కడే యుండవలెను. (అని యాటముతో నన్వేషించుట నటించును.)

(అంతట దేవి కాశీరాజపుత్రి సపరివారముగఁ బ్రవేశించును)

దేవి ;- నిపుణికా ! ఆర్యమాణవకునితోఁ గలిసి యార్యపుత్రుఁడు లతాగృహము చేరుట నిజముగాఁ జూచి చెప్పితివా ?

నిపు ;- భట్టిని కెన్నడైన నసత్యము చెప్పితివా ?

దేవి :- ఈ లతాంతరమున దాగి నీవుచెప్పిన విషయము సత్యమగునేమో వీరి సంభాషణ వలనఁ దెలిసికొనెదను.

నిపు ;- భట్టిని యిష్టము.

దేవి :- (పరిక్రమించి) శిధిల చీవరమువలె నున్న దిది యేమి ? దక్షిణ మారుతా నీతమై యిటు కదలి వచ్చు చున్నది.

నిపు : - (విభావించి) తిరుగుడు పడినప్పు డక్షరములు కనుపించు చున్నవి గాన నిది భూర్జ పత్రము. ఓహో ! భట్టిని నూపుర కోటికే దగిలినది. (తీసి) చదువనా ?

దేవి :- లోపలఁ జదువుకొనుము. వినదగినదేని వినిపింపుము.

నిపు ;- (చదివి) భట్టినీ- భర్త నుద్దేశించి యూర్వశి రచించిన కావ్యబంధ మని యూహించు చున్నాను. ఆర్యమాణవకుని హస్తమునుండి ప్రమాద వశమున జారి, యాదృచ్ఛిక ముగ మనకు దొరికినది.

దేవి :- అయిన, విషయము తెలిసికో దగినదే.

నిపు : - (చదువును)

దేవి :- ఇప్పుడే, యిచ్చట నా యమరవధూటి కాముకు నీ యుడుగర తోడనే సందర్శించెదను .

విదూ :- వయస్యా ! ప్రభుదవరమున కవ్వల క్రీడాపర్వతాగ్రమున వాతావధూతమై రెప రెప లాడుచున్న దదేమి ?

రాజు : - (లేచి నిల్చుని వసంత ప్రియుడా ! ఓ దక్షిణా నిలుఁడా !

ఆమని పూల పుప్పొడు లొయారముగా హరియింప రమ్య శో
భామృదు వాసనల్ గలుఁగ వచ్చును గాని మదీయ ప్రేయసీ
ప్రేమ రసార్ద్రలేఖను హరింపఁగ నేటికి ? అంజనా ప్రియా ?
కామ్ మనోవినోద మిది గానవే! ప్రేమ రసానుభూతితో.

నిపు :- భట్టోనీ! దీని కొఱకే వెదకుచున్నారు.

దేవి :- అవును.

విదూ : - మ్లాన కేసరచ్ఛవిఁ బోలు మయూర పింఛము నన్ను మోస గించినది.

రాజు :- సర్వ విధములఁ గూలిపోయితిని.

దేవి :- (సమీపించి) ఆర్యపుత్రున కావేగ మేల? ఇదిగో ! ఆ భూర్జపత్రము.

విదూ ;- (సంభ్రమముతో) ఓహో ! దేవీ ! స్వాగతము !

విదూ ;- (అపవారించి) దురాగతము జరిగినది!

రాజు :- (జనాంతికము) సఖా - ఇప్పు డేమి చేయవలె ?

విదూ :- దొంగిలించిన సొత్తుతో దొరికిన దొంగ యేమి చేయును

రాజు :- (అపవారించి) మూఢుడా ! యిది పరిహాసమునకు సమయమా ?

(ప్రకాశముగ) నేను దీని కొఱకు వెదకుటలేదు. ఇంకొకదానికై వెదకుచున్నాము.

దేని :- ఆత్మ సౌభాగ్య ప్రచ్ఛాదనము సహజమే !

విదూ :- ఇతనికి సత్వరము భోజనము సమకూర్చినచో బిత్తోపశమన మగును

దేవి :- నిపుణికా ! యీ బ్రాహ్మణుఁడు వయస్యు నాదుకొనుచున్నాఁడు.

విదూ:- పిశాచము గూడ భోజనముచేఁ దృప్తినొందును.

రాజు ; - మూర్ఖుఁడా ! న న్నపరాధిగా సూచించుచున్నావు.

దేవి :- అపరాధము నీయందు లేదు. నేనిక్కడ ప్రతికూల దర్శననై నిలుచుటే మహాపరాధము ఇదిగో!
వెళ్ళిపోవుచున్నాను.

రాజు ;-

కుటిల కుంతల ! నాపైనఁ గోపగింప
నేమి చేయుదు నిన్నుఁ బార్థించు కంటె ?
తప్పు చేసిన నీ పాదదాసు పైన
నా గ్రహింపక చూపు మను గ్రహమ్ము.

(అని పాదములఁ బడును)

దేవి :- (ఆత్మగతము) నాకీ నయగారముల నమ్మునంత హృదయ దౌర్బల్యము లేదు. కాని భర్తృ తిరస్కృతి వలన గలుగు పశ్చాత్తాప మునకే వెఱచు చున్నాను. (సపరివారముగ నిష్క్రమించును)

విదూ :- దేవి వర్షానదివలె నప్రసన్నయై తరలినది.

రాజు ;- (నిల్చి) ఆవును !

కామిని నూరడించుటకుఁ గాంతుఁ డనేకవిధాల మాధురీ
కోమల భావ వీచిక లకున్ గిలిగింతలు పెట్టి కృత్రిమ
ప్రేమ రసామృతమ్ము కురిపింపగ వచ్చును గాని యంత
నామె కరంగ బోవ దయథార్థమణుల్ గనలేరె కోవిదుల్.

విదూ :- అయిన నీ కనుకూలమే జరిగినది కన్నులు కలిగినవాఁడు దీపకాంతి చూడ లేఁడు.

రాజు ;- ఆటనకుము. అనురాగ మూర్వశి యందున్నను దేవి యందు గూడ నాకు సమాదరమే కలదు. నా ప్రణిపాతము త్రోసిపుచ్చి నది కావున నేను నట్లే యుందును.

విదూ :- ముం దీ బ్రాహ్మణుని యాక లిచిచ్చు నార్చి చావకుండ రక్షింపుము భోజనవేళ యైనది.

రాజు :- మధ్యాహ్న మైనది.

తఱచుగు చెట్టునీడఁ దలదాచుకొనెన్ శిఖి యెండ వేడి చే
నర విడు కర్ణికార సుమమందునఁ దుమ్మెద డాగెఁ దీర వా
రిరుహలతా నివాసము వరించెఁ గరండవ మెండమాడి, పం
జరమునఁ బ్రోది చిల్క పొడి నాలుక తోడ జలమ్ము వేడెడిన్ .

\- ద్వితీయాంకము -

## తృతీయాంకము

(అంతట భరత శిష్యు లిద్దరు ప్రవేశించెదరు)

ప్రథముఁడు - మిత్రమా ! పల్లవా ! గురుదేవులు నిన్ను మహేంద్ర సదనమునకుఁ దమ యాసన పీఠము దెమ్మని నన్నింటియొద్ద నగ్ని శరణమును గాచుచుండు మని వినియోగించిరి గదా! అందుచే నడుగుచున్నాను. గురుదేవుల ప్రయోగము దేవతా పారిషదులు మెచ్చిరి గదా !

ద్వితీయుఁడు :- గాలవా! సామాజికుల మాట నాకుఁ దెలియదు. కాని సరస్వతీ విరచితమైన యా లక్ష్మి స్వయంవర కావ్య బంధమున రసాంతరములఁ దన్మయత్వము బొందిరి. కాని -

ప్రథ : - కాని - యనుటలో దోషస్ఫూర్తి యున్నది

ద్వితీ;- అవును. ప్రయోగ మధ్యమున నూర్వశి ప్రమాదవశమున వాక్య స్ఖలనమునకు లోనయినది.

ప్రథ ;- ఏమది ?

ద్వితీ ;- లక్ష్మి భూమిక: దాల్చిన యూర్వశిని వారుణి భూమికఁ దాల్చిన మేనక యడిగినది. "సఖీ ! యిచ్చట త్రిలోక పాలకులు కేశవు నితో సయితము వచ్చియున్నారు. నీ వెవ్వరి వరించెదవు?"అని.

ప్రథ :- తరువాత, తరువాత

ద్వితీ ;- పురుషో త్తముని యనుటకు బదులు పురూరవు నని నోరుజారినది.

ప్రథ :- ఇంద్రియములు భవితవ్యము ననుసరించును. ఏమి గురువు గారికిఁ గోపము రాలేదా ?

ద్వితీ ;- అవును ఆమెకు శాపమిచ్చినారు. కాని యింద్రుఁడనుగ్రహించెను.

ప్రథ ;- ఎట్లు

ద్వితీ :- 'నా యుపదేశము మీరినావు గావున నీకు దివ్యత్వము తొలఁగు గాత' యని గురుశాపము. కాని మహేంద్రుఁడు ప్రయోగానంతరము లజ్జావనత ముఖియై నిల్చిన యూర్వశిఁ జూచి, 'నాకు రణ సహాయుఁడగు రాజర్షికిఁ బ్రియము చేయ వలసి యున్నది. నీవు పురూరవుఁ గూడి యభీష్ట సంతృప్తినొంది, నీ సమాగమము వలన నుద్భవించిన సుతుని ముఖ మాతఁడు చూడు వరకు నతని గూడియుండి తరువాత స్వర్గమునకు మగుడఁ జేరుము.

ప్రథ :- మహేంద్రుఁడు పురుషాంతర విదుఁడు.

ద్వితీ : - (సూర్యునిఁ జూచి) ఈ కథా ప్రసంగమున గురుదేవుల స్నానవేళ యతిక్రమించుచున్నది. పోవుదము రమ్ము.

(ఉభయులు నిష్క్రమించెదరు.)

- విష్కంభము -

అంతట కంచుకి ప్రవేశము.

కంచుకి;- యౌవన మందు సంపదల నార్జన చేసి కుమారులందునన్

జీవన భారముంచి తుదిఁ జెందెద రెల్లరు శాంతి పెద్దలై;

యీ వనితాలయమ్మునఁ దపించుచు నిప్పటికైనఁ గూడ సే

వావిధి తప్పదయ్యె ముదివగ్గుకు నాకు నికేమి సేయుదున్!

(పరిక్రమించి) "అభిమానము నుజ్జగించి నిపుణికా ముఖమున నిదివఱకే మహారాజును వేడికొని యున్నాను. ఆ నివేదనమే నీవును జేయవలసి యున్న"దని వ్రత దీక్షాపరురాలైన కాశీరాజ పుత్రి నా కాజ్ఞాపించినది. కావున సాయంసంధ్యావందనము ముగించుకొనిన మహారాజును డాసెదగాక. (పరిక్రమించి చూచి) రాజప్రాసాదములఁదు దివసావసానము లత్యంత రమణీయములు గదా !

నెమళులు వాసయష్టిపయి నిద్దుర జోగుటఁ దోచె శిల్పరూ

పములుగఁ, బావురమ్ములను భ్రాంతిని గొల్పెడి జాలధూపధూ

మము, నిలిపెన్ వయశ్శుభ సుమంగళి మంగళ సాంధ్యదీపికా

విమల సుమార్చనా బలినివేదన లంతిపురమ్ము లోపలన్,

(తెరవంకఁ జూచి) మహారాజి టే వచ్చు చున్నాఁడు.

పరిజన సతులు కాగడాల్ పట్టి కొలువ

కర్ణికార కుసుమ కళికా ప్రదీప్త

పార్శ్వములతోడ లెక్కలు వడసియున్న

జంగమగిరి వలెన్ వచ్చె చక్రవర్తి.

(అంతట రాజు విదూషకునితో యథోక్తముగఁ బ్రవేశించును)

కం :- జయము జయము మహారాజునకు. దేవరకు దేవి విజ్ఞాపనమిది. "మణి హర్మ్యమునుండి రోహిణీయుక్తుఁడైన

చంద్రభగవానుని దేవరతోఁ బాటు సందర్శింపఁ గోరుచున్నాను".

రాజు :-ఆర్య లాతవ్య ! దేవి యభీష్టము కానిమ్మని చెప్పుము.

కం ;- దేవర యాజ్ఞ నెరవేర్చెదను.

రాజు :- వయస్యా, దేవి సల్పు నీ వ్రత పరమార్థమేమి?

విదూ :- నీ ప్రణిపాత ముల్లంఘించి నందుకు పశ్చాత్తాపముతో వ్రతమిష బూను చున్నదని తలఁచెదను.

రాజు :- నీ యూహ సరియైనదే

నాయకుఁ దన్ని పైచును మనస్విని పాదము లంటి నంతటన్
బోయిన పిమ్మటన్ మిగులఁ బొక్కుచు నుండు సదా వియోగ బా
ధాయుత చిత్తయౌచు, నయినప్పటికిన్ బ్రియుఁ జేరి జీర సే
దో యవమాన మంచు మది నూహ యొనర్చును బింక మేర్పడన్

కావున మణిహర్మ్యమునకు దారిఁ జూపుము

విదూ :- మార్గ మిదియే ! మార్గ మిడియే! ఈ ప్రదోష సమయమున స్పటిక మణిసోపానపరంపర గంగాతరంగపంక్తి వలె రమణీయముగ నున్నది

రాజు : - ముందు నీ వధిరోహింపుము.

విదూ: - ఓహో! చంద్రోదయ మాసన్నమైనది. తిమిర రహితమగుచున్న ప్రాచ్య దేశాముఖము నయన శుభముగ నున్నది.

రాజు :-

తూర్పుకుల పెన్క జాబిల్లి తోచినంత
చవ్వు దవ్వులఁ దొలఁగెను దమము విరిగి
మోము ముంగురుల్ ప్రాక్సతి ముడిచినట్లు
తోచుచున్నది నా కన్నుదోయి కిపుడు.

విదూ :- ఈ ద్విజరాజు లడ్డుండ ముక్కవలె నుదయించుచున్నాడు.

రాజు :- (నవ్వుతో) తిండిపోతు కెప్పుడు కడుపాత్రమే(అంజలి ఘటించి)

క్షుపానాథా ! హరచూడామణీ! నమస్కారము. ఈ వెన్నెలలో గరదీపిక లేల ?

పరిజనులు :- మహారాజుగారి యాజ్ఞ (నిష్క్రమింతెదరు)

రాజు ; - ముహూర్తకాలములో దేవి వచ్చును. ఇంతలో నా యవస్థఁ దెలిపెదను. వినుము.

విదూ :- చూచుచునే యున్నానుగదా ఇఁకఁ జెప్పనేల? ఆమె గాఢాను రాగము వ్యక్తమైనది గాన సమాగమాశతో నుండవచ్చును.

రాజు;- అవును. కాని నామనోవ్యధ విషమశిలావరోధమున, నదీ ప్రవాహము నానాముఖముల బొరలి ప్రవహించు నట్లు, మిక్కుట మగుచున్నది.

విదూ :- నీ ముఖశోభ కల్యాణ సంయోగము సూచించు చున్నది.

రాజు ; - నీ యాశావాక్కులకుఁ దోడు నా కుడిభుజ మదరుచున్నది.

విదూ :- బ్రాహ్మణ వచనము వృధా యగునా ?

(అంతట నాకాశయానమున చిత్రలేఖతో గూడి యభిసారికా వేషమున నూర్వశి ప్రవేశము)

ఊర్వశి. - చిత్రలేఖా ! అల్పాభరణ భూషితమైన యీ యభిసారికావేషము నీలాంశుకము నీకు రుచించుచున్నవా ?

చిత్ర :- నిన్నుఁ బొగడ వలె ననిన నాకు మాటలు సేర్పులేదు. 'నేనే పురూరవుఁడ నైన నెంత బాగుండునా' యని యువ్విళ్ళూరు చున్నాను.

ఊర్వ ;- మదనుఁడు తొందర పెట్టుచున్నాఁడు శీఘ్రముగా నా సుభగుని సౌధము చేర్పుము.

చిత్ర;- కైలాస శిఖరము వలె నున్న నీ ప్రియతముని హర్మ్యమిదిగో!

ఊర్వ :- నా హృదయచోరుఁ డెచ్చట నున్నాడో యేమి చేయుచున్నాఁడో మహిమానుభూతి వలనఁ గనుగొనుము.

చిత్ర :- (ఆత్మ గతము) కొంచెము వినోదమున కామె నుడికించి చూచెదను

(ప్రకాశముగ) అతఁడు మనోరథలబ్ధ ప్రేయసీ సల్లాప సౌఖ్య శృంగార పరవశుఁడై యున్నాఁడు.

ఊర్వ ;- (విషాదము నభినయించును).

చిత్ర :- మూర్ఖురాలా! ప్రియుఁ డన్యాసక్తుఁడై నాఁడని, యెట్లు తలపోయు చున్నావు?

ఊర్వ :- నా లఘుహృదయ మాశంకలకు లోనయినది.

చిత్ర : - (చూచి) ఇదిగో! మణిహర్మ్యముపై వయస్యునితో నేకాంతముగ మహారాజు కూర్చొని యున్నాఁడు.

(ఉభయులు దిగుదురు)

రాజు : - మిత్రుఁడా ! రాత్రితో మదనబాధ విజృంభించు చున్నది.

ఊర్వ :- ఈ సందిగ్ధ వచనములు విని నా హృదయము కంపించుచున్నది. సంశయచ్ఛేద మగు వరకు నీతని స్వైరాలాపముల నదృశ్యముగ నుండి విందుము గాక.

చిత్ర :- నీ యిష్టము

విదూ:- అమృత నిష్యందము లైన చంద్ర కిరణములు నీకు సంతోషము కల్గించు గాక !

రాజు :- ఈ బాధ యీ విధముగాఁ దొలఁగునది కాదు, సుమ శయనమ్ము సౌరభ విశోభిత సుందర మంద మారుత మ్మమృత మరీచిమాలి యుదయమ్మును జందన చర్చలీ యనర్ఘ మణులు నేల ? యీ విరహారాగము నాపగఁ జాలు నింక నా యమర వధూటియున్ మఱియు.

ఊర్వ:- మఱియు ?

రాజు :- ఆమె విలాస రహః ప్రసంగముల్.

ఊర్వ; - హృదయమా ! నన్ను వీడి యతనిఁ జేరి నందుకుఁ దగిన సత్కారము నందితివి.

విదూ :- శిఖరిణీ ఫలములు లభింపక పోయినపుడు తన్నామస్మరణ చేయుచుఁ దృప్తి నొందెదను.

రాజు :- అయిన ఫలములు లభించునా?

విదూ :- కాని నీ వామెను త్వరలోఁ బొందెదవు గాక.

రాజు :- సఖా- నా యభిప్రాయము

చిత్ర ;- సఖీ - విస్పష్టముగాఁ వినుము.

విదూ :- చెప్పుము.

రాజు :- ఆమె భుజముతో రాపిడి నందినట్టి
భుజ మదొక్కటి మాత్రమె పూత మయ్యె;
ఈ శరీరము నందంచు నెంతు నేను
తక్కిన యవయవములేల? ధరణి బరువు.

చిత్ర:- సఖీ! వినుము; సంతృప్తి కలిగినదా?

ఊర్వ:- (సమీపించి) మహారా జెదుటనున్న నన్ను గుర్తించుట లేదు.

చిత్ర :- నీ తొందర పాటునఁ దిరస్కరిణిని దొలగించ లేదుగదా !

(తెరలో) ఇటు ఇటు మహారాజ్ఞి !

(అందఱు చెవి యొగ్గుదురు. ఊర్వశి నెచ్చలితోఁ గలిసి విషణ్ణ యగును.)

విదూ : - మహారాజ్ఞి వచ్చుచున్నది. కావున మౌనము వహించుట మంచిది.

రాజు :- నీ మనో భావములు ముఖమునఁ గనుపింపఁ చేయకుము.

ఊర్వ :- సఖీ -కర్తవ్య మేమి?

చిత్ర :- ఆవేగ మేల? మన మదృశ్యముగ నున్నాముగదా ! ఉపవాస దీక్షచే రాణి కృశించి యున్నది. అందుచే నిట తడయక వెళ్ళిపోవును.

(అంతట నుపహారముల బూనిన పరిజనముతో దేవి ప్రవేశించును)

దేవి :- (చంద్రునిగాంచి) నిపుణికా ! మృగలాంఛనుఁడు రోహిణీ యుక్తుఁడై మిక్కిలి శోభించుచున్నాఁడు.

చేటి :- మహారాణీ యుక్తుఁడై మహారాజుగూడ శోభించును.

విదూ :- (చూచి) నాకు స్వస్తివాచన మిచ్చుటచేతనో, రోషము నుజ్జగించి పశ్చాత్తాపము చెంది భర్త ప్రసాదము నొందుటకై వ్రత మిష బూనుట చేతనో, దేవి శుభ దర్శనయై యొప్పు చున్నది

రాజు ; - (నవ్వుచు) ఉభయము నుపపన్నములే కావచ్చును. కాని

మంగళ విభూషణైక నిర్మల చరిత్ర
ధవళ శుభ్రదుకూల సంతరళదీప్తి
వ్రత మిషను బూని నేఁడు గర్వమును వీడి
సన్నుతాంగి వచ్చె ననున్ బ్రసన్నుఁ జేయ.

దేవి :- జయము జయ మార్యపుత్రులకు.

విదూ :- మహారాజ్ఞికి స్వస్తి.

రాజు : - దేవికి స్వాగతము.

ఊర్వ:- దేవీ శబ్ద మీమెయెడ సార్థకము. తేజస్సులో నింద్రాణి కీమెతీసిపోదు.

చిత్ర :- లెస్స పలుకు! మాత్సర్యము నుజ్జగింపఁ గలిగితివి.

దేవి ;- ఆర్య పుత్ర పురస్సరముగ నొక వ్రత ముద్దేశించినాను. ముహూర్త మోపిక పట్టి యీ యంతరాయము సహింపవలెను.

రాలు - అంతరాయమా? అనుగ్రహమే.

దేవి :- ఇట్టి యంతరాయములు స్వస్తి వాచనములతోఁ గలసి యెల్లప్పుడు సిద్ధించుగాక.

రాజు :- దేవి సలుపుచున్న వ్రతము పేరు?

దేవి :- (నిపుణిక వైపు చూచును)

నిపు :- మహారాజా ! ఈ వ్రతము పేరు ప్రియాను ప్రసాధనము.

రాజు: - (దేవిని జూచి) ఓహో! అది యేనా?

ఏల కళ్యాణి నేఁడు మృణాల కోమ
'లమ్ము వాడెను నీ శరీరమ్ము వ్రతము
చేత వేరే నన్ను బ్రసన్న చిత్తుఁ జేయ
నేల నీ పాద దాసుండ నేను నిజము.

ఊర్వ;- మహారాజునకు దేవేరి యెడఁగల గౌరవ మధికము.

చిత్ర :- మూర్ఖురాలా ? అన్యాసక్తులైన నాగరకులు భార్యలయెడ విశేష దాక్షిణ్యము చూపుదురు.

దేవి :- (నవ్వుచు) ఆర్యపుత్రు లిట్లు ప్రసన్నులగుట యీ వ్రత మాహాత్మ్యమే.

విదూ :- వయస్యా ! సద్వ్రత సంకల్పమును బ్రతిఘటింపరాదు.

దేవి :- (పరిజనుల నుద్దేశించి) పూజా ద్రవ్యముల నిటు దెండు. మణి హర్మ్యము నోకుచున్న చంద్ర కిరణముల నర్చించెదను.

పరిజనులు :- దేవి యాజ్ఞ ప్రకార మిదిగో చందన పుష్పాక్షతలు.

దేవి :- (నాట్యమున గంధ పుష్పాదులచేఁ జంద్ర కిరణముల నర్పించును)

ఈ యుపహార మోదకముల నార్యమాణవున కిండు.

పరి :- దేవి యాజ్ఞ

విదూ :- మహారాజ్ఞి యుపవాసము బహు ఫలప్రదమై స్వస్తి యగుత!

దేవి :- ఆర్యపుత్రు లిటు రావలె

రాజు :- ఇదిగో ! ఇక్కడనే యున్నాను.

దేవి :- (రాజును బూజించి ప్రాంజలి ఘటించి) దేవతా దంపతులు రోహిణీ చంద్రులు సాక్షిగా నార్యపుత్రునిఁ బ్రసన్ను జేయు చున్నాను. నేఁడు మొద లార్యపుత్రుఁడే యువతి యం దనురాగ స్విన్ను డగునో యామె యందు నేను గూడ సంప్రీతితో నుండగలను.

ఊర్వ:- ఆమె పలుకుల పరమార్థము నాకు బోధ పడక పోయినను విశ్వాసము కలిగినది.

చిత్ర :- నీ కిక ( బ్రియా సమాగమమున కెట్టి యంతరాయమును లేదు. మహాను భావురాలు మహాపతివ్రత యనుమతించినది.

విదూ ;- (ఆపవారించి) చేతినుండి చేప నీటిలో జారిపడి తప్పించు కొని నవుడు జాలరి, ప్రాణదానము వల్ల పుణ్యము సిద్ధించుగాత మని తలపోయును. (ప్రకాశముగ) మహారాజ్ఞి ! మహారా జనిన నీ కెంత ప్రీతి !

దేవి :-మూడుఁడా ! నా సుఖము చూచుకొనక యార్యపుతుని సుఖము గోరుచున్నాను. ఇఁక బ్రీతి యున్న దో లేదో యూహించుకొనుము.

రాజు :-

నేను నీ పాద దాసుండఁ గాన నన్ను
నిష్టమైన వారికి దాన మీయవచ్చుఁ
గూర్మి నీవె నన్నేలుకోఁ గోరవచ్చు.
తరుణి ! అన్యథా శంకింప ధర్మ మగునె ?

దేవి :- ఎట్లైన నాకేమి? నా ప్రియానుప్రసాధన వ్రతము ముగిసినది. ఇక బోవుచున్నాను. (దేవి నిష్క్రమింపఁ బోవును)

రాజు:- ప్రేయసీ! నన్నిట్లు విడిచి పుచ్చిన నెట్లు ప్రసన్నుఁడ నగుదును.

దేవి ;- ఆర్యపుత్రా ! నా వ్రతనియమములు నతిక్రమించలేను. (సపరి వారముగ నిష్క్రమించును)

ఊర్వ:- మహారా జెంతటి ప్రియ కళత్రుఁడు !

చిత్ర :- నీ వేల నిరాశఁ జెందుచున్నావు?

రాజు :- (ఆసనమునుండి లేచి) దేవి దూరముగాఁ బోయినది గదా !

విదూ :- వయస్యా ! ఇక ధైర్యముగాఁ నుండవచ్చును. అసాధ్య రోగిని వైద్యుడు వలె దేవి నిన్ను స్వచ్ఛందముగా విడిచి పుచ్చినది.

రాజు :- కాని, యా యూర్వశి

ఊర్వ,- నేను ధన్యాత్మురాల నైతిని.

రాజు :-

అగపడకుండ ఘల్లుమను సందెల సవ్వడి యైన డాయుతన్
వగలు వెలార్చి వెన్కకును వచ్చి కనుంగవ మూయుగాతఁ దో
డుగ గొనివచ్చి సెచ్చెలి యడుంగులలోన నడుంగువేయ మె
ల్లగ నడిపించి సిగ్గుతెరలన్ సవరించుచు నామె తెచ్చుతన్.

ఊర్వ:- సఖీ మహారాజు మనోరథమునే యీడేర్చెదను గాక!

(రాజు వెనుకకుఁ జేరి కన్నులు మూయును)

రాజు :- ( స్పర్శ సుఖము నభినయించి) ఈ వరారోహ యూర్వశి వలె నున్నదే!

విదూ :- నీ కెట్లు తెలిసింది ?

రాజు :- తెలిసికొనుట కేమున్నది?

విరహ వేదనా తప్తమై వేగి యున్న
యీ శరీరమ్ము సౌఖ్య మికెట్లు పొందు?
కూర్మి చంద్ర సంస్పర్శకుఁ గుముదకళిక
పులకరించును రవికరస్ఫూర్తిఁ గనలు,

ఊర్వ:- (చేతులు దీసి దూరముగఁ దొలఁగి) జయము జయము మహారాజునకు.

రాజు :- సుందరీ ! స్వాగతము.

చిత్ర :- వయస్యులు కుశలమా ?

రాజు :-ఇప్పుడే యొనగూడినది.

ఊర్వ:- మహారాజును దేవియే దాన మిచ్చినది. ఇఁకఁ బ్రణయినివలె దగ్గరకుఁ జేరిన తప్పు లేదు.

విదూ :- సూర్యుఁ డ స్తమించుచున్నాఁడు.

చిత్ర :- మహారాజా వసంతానంతరము గ్రీష్మమున నేను సూర్యదేవు నుపాసింప వలసియున్నది. కావున మా ప్రియసఖి స్వర్గము మరచునట్లు చేయు బాధ్యత మీయందుఁ గలదు.

విదూ:- స్వర్గములో నేమున్నది. భోజన నిద్రాపాన సౌఖ్యములు లేవు. ఉన్మీల నయనులై మీనముల నపహసించుచున్నట్లుందురంతియే కదా!

రాజు : అపార సుఖాకరమైన స్వర్గము నెవరు మరపింపఁ గలరు? కాని - పురూరవుఁ డనన్యనారీసక్తుఁడై యూర్వశీ దాసుఁడు కాగలఁడు.

చిత్ర : మహారా జనుగ్రహించెను. సఖి! ఊర్వశీ! ధైర్యముతో వీడ్కోలు ననుగ్రహింపుము,

ఊర్వ:- (కౌగిలించుకొని) నన్ను మరచిపోవద్దు సుమా.

చిత్ర - ప్రియా సంయుక్తమైన నిన్నే నే నట్లర్థించవలసియున్నది.

విదూ - అభీష్ట సిద్ధి పొందిన నీకు నా ధన్యవాదములు

రాజు: అవును. ఇది నా అదృష్టము.

ఈ వనితాచరణ శ్రీ

సేవకు సరియౌనె ? ఛత్ర సింహాసనముల్

భూవల్లభ శుభ మకుట త

టీ విలసద్రత్న సంఘటిత పదయుగియున్.

ఊర్వ:- ఇంత కంటె నాకుఁ బ్రియతర మేమున్నది?

రాజు : - (ఊర్వశి హ స్తము గ్రహించి) అభీష్ట సిద్ధి వలన వైరుధ్యములు సమసి పోవుచున్నవి.

చల్లని వెన్నెలల్ చిలికి సౌఖ్యము గూర్చుచునుండె నిష్ఠు జా

బిల్లి, ప్రసూనబాణములు వేయు మరుండె మనోనుకూలుఁడౌ!

తొల్లి యెవేవి బాధలని తోచెనొ యవ్వియె నేఁడు చూడ నో

పల్లవ పాటలాధర ! భవత్కరుణాప్తిని సౌఖ్య మిచ్చెడిన్.

ఊర్వ:- ఆలస్యము చేసి యార్యపుత్రున కపరాధము గావించితినేమో ?

రాజు : - అట్లనకుము.

దుఃఖ భారము వెనువెంటఁ దోఁచు సుఖము

యోగ్యమై యనుభవమున కొప్పుచుండు;

ఎండ దెబ్బ తినిన వాని కింపుఁ గూర్చు

నీడ, సౌఖ్యప్రదంబౌచు నిశ్చయముగ.

విదూ :- ప్రదోషరమణీయమైన జ్యోత్స్నా నంద మింతవఱ కనుభ వించితిమి. గృహాభ్యంతరమున కిఁకఁ బోవుట మంచిది.

రాజు :- అయిన మార్గదర్శకుఁడవు గమ్ము.

విదూ :- ఇది యిది మార్గము.

రాజు :- సుందరీ నా ప్రార్థన మిది.

ఊర్వ:- ఏమది ?

రాజు :- ప్రణయ సిద్ధిని గాంచని రాత్రు లపుడు

దీర్ఘయామమ్ము లౌచు గతింపకుండె:

ఇపుడు గూడ నట్లే యగునని నేని

శెట్టి యదృష్టశాలినో యెఱుఁగ వశమె,

(అందఱు నిష్క్రమించెదరు)

# చతుర్థాంకము

(అంతట విమనస్కయై చిత్రలేఖ సహజన్మతో గూడి ప్రవేశించును )

సహజన్మ:-(చిత్రలేఖ నుద్దేశించి) సఖీ! వాడిన శతపత్రమువలె నున్న నీ ముఖచాయ హృదయము నందలి యారాటము సూచించుచున్నది. నీ నిర్వేద కారణము దెలుపుము. నీ దుఃఖమునఁ బాలు పంచు కొనెదను.

చిత్రలేఖ:- అప్సరోచితమైన సూర్యారాధనయందు మునిగియుండగా నూర్వశిని గూర్చి యుత్కంఠఁ గలిగినది.

సహ :- మీ పరస్పర స్నేహము నాకుఁ దెలియును. తరువాత

చిత్ర :- ఈ దినములలో నామె వృత్తాంతము తెలిసికొనఁగోరి ప్రణిధానము సలుపఁగా నత్యాహితము బయల్పడినది?

సహ :- (ఆవేశముతో) ఏమి జరిగినది?

చిత్ర :- ఊర్వశి, విలాస లాలసయై రాజ్యభారమును మంత్రుల యందుంచిన రాజర్షిని గూడి గంధమాదన పర్వతమున విహరించుట కేగినది.

సహ :- అట్టి ప్రదేశములందే శృంగార భోగానుభవము చెల్లును.

చిత్ర .- అచ్చట మందాకినీ పులినములందు విహరించుచున్న విద్యాధరి యుదయవతిపై రాజర్షి లాలస దృక్కులు వర పెనని కుపిత యైనది.

సహ :- అవును. గాఢానురాగము వ్యగ్రతను సహింపదు.

చిత్ర :- అంతటఁ బ్రియానునయముల సరకు గొనక, గురుశాపప్రేరితయై శ్రీజనపరిహరణీయమైన కుమారవనమునఁ బ్రవేశించి లతావిపరిణామము నొందినది.

సహ :- విధి యనుల్లంఘనీయము. అట్టి యాదర్శ ప్రేమ కెట్టి యనర్థము వాటిల్లినది. పాపము రాజర్షి యెట్టి యవస్థ చెందినాఁడో !

చిత్ర :- ఆ కాననమందే రాజర్షి ప్రియతమాన్వేషణమునఁ బవలు రేలు గడుపుచున్నాఁడు. మహోత్కంఠాకారణ మగు నీ మేఘో దయము వియోగులకు మఱింత దుస్సహము గదా!

సహ :- అట్టి యాకృతి విశేషములు చిర దుఃఖావహములు కానేరవు. ఎవరి యనుగ్రహమువల్లనో యెదో సమాగమ కారణ మేర్పడఁ గలదు. ఉదయభానుని యారాధించుదము రమ్ము.

\- ప్రవేశకము -

(అంతట నున్మత్తవేషుఁడు రాజు ప్రవేశము)

రాజు :- ఆగు దురాత్ముఁడా! ఆగుము. నా ప్రియతమ నెక్కడకుఁ గొనిపోవుచున్నావు? శైల శిఖరమునుండి గగనాంతరమున కెగిరి నాపై బాణవర్షము కురియుచున్నాఁడు. (నిరూపించి)

నల్లని మబ్బిదే ధనుజనాథుఁడుగా డిది శత్రు సజ్యమౌ
విల్లును గాదు, ఇంద్రధనువే యిది సాయకవృష్టిగా దహో
జల్లులు వాన గాని నికషమ్మున బంగరు గీతవోని వి
ద్యుల్లతగాని నా ప్రణయతోయజలోచన గాదు చూడఁగన్.

(ఆలోచించి) నా హృదయేశ్వరి యెచ్చటకు బోయియుండును?

ప్రణయిని శీఘ్రకోపన తిరస్కరిణీ మహిమన్ వహింప, ని
ల్పనగునె కోప మిప్పటికి, స్వర్గము జేరె నటన్న నాపయిన్
మనసిడెఁ గాదె? మామక సమక్షమునందె హరింపఁగల్గు నా
దనుజ విభుండు దివ్యవనితామణి యెట్టు అదృశ్యమయ్యెనో.

(దిక్కుల నవలోకించి నిట్టూర్చి) దురదృష్టశీలికి కష్టముల పైఁ గష్టములు ముసురుకొని వచ్చుచుండును.

కుటిల భ్రూవల్లిక విడి
పటుతరముగఁ గుంద మేఘ పటల క్రీడా
నటనచ్చట లిటు తొలకరి
చిటపొటి చినుకులు చిలుకుచుఁ జెన్ను వహించెన్.

(నవ్వుచు) వృథా పరితాపవృద్ధి సహింప వలసివచ్చుచున్నది. ఋషులు గూడ రాజు కాలమును శాసించునందురు. ప్రావృట్ కాలమును నేనేల యాపరాదు! కాని, వర్షా చిహ్నములే నాకు రాజోపచారముల నొనగూర్చుచున్నవి.

విద్యుల్లతా కనకద్యుతి మేఘమ్ము
ప్రభు చిహ్నమైన ఛత్రమ్ము నాకు!
పూలగుత్తులతోడ దూలెడు నిచుళ వృ
క్షమ్మె వీచెడి చామరమ్ము నాకు!

కారుమబ్బులఁ గాంచి కంఠ మెత్తిన నీల

కంఠముల్ వందిమాగధులు నాకు!

సెలయేటి సరులతో సేవించు గిరిపతి

బహుమాన మిడు వణిగ్వరుఁడు నాకు !

ఎట్టులో రాజలాంఛనాలెల్ల నాకు

నిచట సమకూరినట్లు భావింపనేల?

ప్రేయసీ విరహోన్మదావేగకలనఁ

బొక్కు చున్నాఁడ నీ వన్య భూమిలోన.

(చూచి) అయ్యో ! ఈ యన్వేషణ కుపక్రమింపగనే నా యావేదన యతిశయించుచున్నది. ఏలన

సలిల విలలిత కుసుమ కం

దళి సల్లలితారుణాంచితమ్ముగ నొప్పున్,

తలపున నిలిచెను గనుఁగొ

ల్కుల బాష్పము ఉర లిన యతి కోపన వోలెన్,

ఆమె యెచ్చటి కేగినది యెట్లు తెలియనగును ! (పరిక్రమించి హర్షముతోఁ జూచి) ఇదిగో ! ఆ కోపన యనుగమించిన మార్గము నుపలక్షించు చిహ్నములు కనుపించు చున్నవి.

అధరరాగ సంసక్త బాష్పాంబుసిక్త

మై శుకోదర శ్యామల మైన దదిగో !

ఉత్తరీయమ్ము రోష వేగోచ్చలితము

జారి పడియుండె నామె భుజమ్ము నుండి.

(నిరూపించి) ఏమిది? ఇది యింద్రగోపములతో గూడిన నవ శాద్వలము ! ఈ నిర్జన కాననాంతరమున నా ప్రేయసి యునికి పట్టు లెట్లు తెలియగును? అసారోచ్ఛసిత శైలేయ స్థలమధి రోహించి వాతావధూతమైన శిఖితో కంఠమెత్తి మేఘావలోకనము సల్పుచున్న నెమలి నడిగెదను,

నునునోగ కడకనుల వె

ల్గును గురిసెడి నా ప్రణయిని కోమలగాత్రన్

నునునోగ తెలిగనులతోఁ,

గనుగొని యున్నావొ నీలకంఠమ యడవిన్?

ఏమి ? సమాధానము చెప్పకుండగనే నాట్యము నారంభించినది? ఈ హర్షోద్వేగ హేతువేమై యుండనోపు ? తెలిసినది;

మృదు పవనమ్ములోనఁ జెలరేఁగఁ గలాపి కలాప మోక్ష స

మ్మదమున పుష్పగుచ్ఛ సుషమా సుకుమార సుగంధ కేశి సౌ

హృదమయిఁ జూచి సిగ్గునఁ దపించుచుఁ బించెము విప్పకుండ దా

గదె, ప్రియ లేక యుండుటనుగాదె వహించెడి నీ దురుద్ధతిన్.

కానిమ్ము. ఇతరుల కష్టములఁ జూచి సంతోషించువారిని పలుకరింపఁ దగదు. (పరిక్రమించి) వేసవి నడచుటచే సంధు క్షితమైన పరభృతము జంబూ వృక్ష విటపాంతరము చేరినది. ఇది పక్షులందు పండిత జాతి. దీని నడిగెద గాక !

కలరవముతోడఁ బ్రియులను

గలవరమును బెట్టి వేగఁ గలుపుదు వటగా!

కలభాషిణి తెమ్మిచటికిఁ,

గలచోటికయిన నను గొని కలుపు వేవేగన్.

(చూచి) ఏమిది? భూతకోటి స్వకార్య పరాయణము గదా!

పరదుఃఖము కడు శీతము,

విరహార్తిని నే కుములగ     పికి నేరెడుపై

కొఱికెడి ముగ్గిన పండ్ల న

ధరము వలెన్ గన్ను మూయు దర్పము తోడన్.

అయినను నాకేమియుఁ గోపము లేదు. ఏలన నామె కంఠము నా ప్రేయసి వాఙ్మాధురీ స్ఫోరకము. (పరిక్రమించి చెవియొగ్గి) ఓహో ! దక్షిణమున ప్రేయసీ నూపుర శింజిత నినాదము విని పించు చున్నది. ఆచటి కేగెదగా (పరిక్రమించి) అయ్యో !

కలరుత మందెల చిరుగ

జ్జెల సవ్వడిగా దరయగఁ జేరగఁజూచున్

గలగల మానసమునకున్

గలహంసలు, కార్మొయిళులు గ్రమ్ముట చేతన్.

కానిమ్ము. మానసోత్సుకములైన యీ పక్షు లీ సరోవరమునుండి యెగిరి పోవక ముందే ప్రేయసివార్త తెలిసికొన వలెను. (సమీపించి)

కొనిపోవచ్చు మృణాల

మ్మును పాథేయమ్ముగ మునుముందు ప్రియా వా

ర్తను దెలుపుము హంసమ స

జ్జను లెపుడు పరోపకారణాలురు గాదే.

మానసోత్సుకమై యున్నయనపై యుండుటచే గాన లేదని చెప్పుచుంటివా ?

నీవు నతభ్రువున్ గనుట నిక్కము; రోష కషాయనేత్రయై

యీ వనజాక రాన విహరింపగ వచ్చిన యంత, నామె లీ

లావృత మంద మంద మృదుయాన మనోహర ధీర ఖేలన

మ్మీపు హరించినావు కనుపించుచున్నది ప్రస్ఫుటమ్ముగన్.

కావున

ప్రేయసి మందగమనములు

నీయందునఁ గానుపించె నిగృహీతము లే

యేయని దోచినఁ బూ ర్తిగ

నీయవలె గాదె దొంగ యిమ్మిపుడు ప్రియన్.

రాజు చోరాను శాసకుఁడ్రని భయపడి పక్షి యెగిరిపోయినది. ఇదిగో ! చక్రవాకము చక్రవాకిలో నున్నది. ఆడిగెదను గాక.

నలినీపత్రము కొంచె మడ్డమగుటన్ గాంతామణినిన్ గానకే

వలవంతం గడు స్రుక్కుచుందువు గదా వాల్లభ్య సఖ్యంబుతో

దెలియం జాలవె నీవు మామక మనో దీనత్వ నిర్వేదముల్ ;

తెలుపన్ వేడెద నిన్ను ప్రేమమయి నా దేవేరి గన్పించినన్.

సర్వదా దురదృష్టము నన్ను వెంటాడు చున్నది. ఇందొక చోటఁ బ్రయత్నించెదను. (అడుగువేసి యాగి) -

వేరొక చోటికిఁబోనేల

కొదమ తుమ్మెద ఝుంకార కూజితములు
పద్మ గర్భములో నుండి బయలు వెడలె;
చిగురు కెమ్మోవి నానిన చెలువ మిన్న
చేయు సీత్కార రావమ్ము చెన్ను దోప.

కమల దళాంతర మందున్న మధుకరమునే యడిగెదను గాక ! కాని యీ తుమ్మెద చూచియుండునా ?

ఓ సుమనో మధుప్రియ మహోదయ షట్పద ! కాన లేదుగా
ఆ సుకుమారి సౌహృద రసార్ద్ర మనోహర రాగ పూర్ణ ని
శ్వాస పరీత మంజుల సువాసనలన్ జవిచూచి యున్నచో
ఈ సరసీజమందు నివసింతువె నీవు రసజ్ఞ హీనతన్.

ఈ చోటు గమనించెదముగాక. (పరిక్రమించి చూచి) ఇచ్చట నీపశాఖాగ్రసం లగ్న కరమున కరిణీయుక్తుఁడై నాగరాజు నిలిచియున్నాఁడు ఇతనినుండి ప్రియోదంతము నెరి గెదను గాక. కాని తొందర పడఁగూడదు. ప్రియక రేణువు హస్తమునందించుచున్న యాసవ సురభిళమైన నవ సల్లకీభంగము సేవించు గాక (క్షణము నిలిచి చూచి) మాధ్యాహ్నిక భోజనము సేవించినా డు గనుక నిఁక నడుగ వచ్చును.

మదకలా యువతి శశికళఁ జూచియుంటివా ?
గజ యూథపాయూథికాకేళి గాంచితే ?
నిత్య యౌవన రూప నిష్యంద లావణ్య
నిర్మలాలోకఁ గాంచితే? ఓ సుఖాలోక
కాంచియుంటివి నీవు గర్జించుచున్నావు
మంద్ర మధురమ్ముగా మ లేభ యూథపా.

ఊరట కల్గినది. మఱియు సాధర్మ్యము వలన ఈతనియెడ నాకుఁ బ్రీతి జనించుచున్నది.

నన్ను నరేంద్రుఁడందురు జనంబులు; ఊర్వశి నాకు దేవియౌ!
నిన్ను గజేంద్రుఁడందు రిదె నీ ప్రియయౌ వశ యొప్పు దానశీ
లోన్నతి నెపు నిర్వరకు నున్నది గాదె సమానధర్మమై!
యెన్నడు గాని యీ విరహ మేర్పడకుండుత నీకు మాత్రమున్

నీవైన సుఖింపుము! నే నిచ్చటనుండి గమించెదను. (పరిక్ర మించి) అదిగో సురభికందర శిఖరము. అప్సరసలకుఁ బ్రియక్రీడా నిలయము. ఈ యుపత్యకలలో నా సుతనువు విహరించు చుండ వచ్చును. (పరిక్రమించి) ఏమి? ఇచ్చట చీకటి గ్రమ్ము చున్నది. కాని విద్యుత్ప్రభలలోఁ జూచెదను. ఓహో! నా దురదృష్టము వలన మేఘములు గూడ విద్యుద్విరహితములైనవి. అయిన నీ పర్వత రాజు నడిగెదను గాక.

సర్వాంగసుందరి చెలియ

సర్వక్షితిభృదధిప దరిసెన మిడెనా? నా

యూర్వశి విరహోత్కంఠిత

గర్వ కషాయ రస రోష గజగామినియై.

(ఆకర్ణించి హర్షముతో) ఏమి? “దరిసెనమీడెనా ?" నా పలుకుల యథాక్రమముగా నుచ్చరించుచుండెనే? నీవును శుభవార్తా పరంపరల విందువుగాక ! నా ప్రియతమ యెచ్చట నున్నది?

(తెరలో - ఆ మాటలనే విని) అయ్యో! నా పలుకులే గుహాంత రములలో మారుమ్రోగి తిరిగి వినిపించు చున్నవి. (విషాదము నభినయించి) అలసటఁ జెందినాను. ఈ సెలయేటి కెరటాల పై నుండి వీచు పిల్ల తెమ్మెరలచే సేద దీరెదను. తొలకరి వాన వెల్లువలచే బురదనీటితో నున్నను నీ యేరు నిర్ఝరిణి నా మనస్సున కాహ్లాద మొసఁగుచున్నది.

ప్రణయిని శీఘ్రకోపన స్రవంతిగ మారి శిలాప్రదేశ మం

దునఁ బ్రవహించు; క్రొన్నురుగు తుంపర యయ్యె! విలోలచేలముల్

క్వణదణు కింకిణీకలిత కాంచన కాంచి, విహంగ పంక్తియై

నినదము సల్పు: కన్బొమల నిగ్గులవే కెరటాల వంపులౌ.

ఆమె నడిగి చూచెదను గాక.

ప్రణయ విలోల పరాఙ్ముఖ

మనస్కవుగద నను వీడి మానిని ! యెటకో

చనగా నగునే నా యం

దున దోషము లేవి నీకు దోచెనో చెపుమా !

ఏమి ! మౌనము వహించినది. ఇది యథార్థ నదియే. ఒక వేళనూర్వశియే యైన పురూరవు వీడి సాగర్ సమాగమ మిచ్ఛ గించునా ?—అవును; శ్రేయములు నిర్వేద హృదయుల వరిం పవు. నే నా సునయన

తిరోభూతయైన ప్రదేశమునకే యేగెదను గాక (పరిక్రమించిచూచి) ఓహో ! ఆమె పోయినమార్గ మిదియే.

ఇంతి యీ దారి బట్టియే యేగి యుండు!
విషమ కేసరమయ్యును విచ్చియున్న
దదిగో రక్త కదంబక మించి మిన్న
పేనన్ డాల్చె పేసవి వీగిపోవ..

(చూచి) తీరికగాఁ గూర్చొనియున్న యీ సారంగము ప్రియతమా వృత్తాంతముఁ దెలుపవచ్చును.

కానన శోభను గాంచెడి
కానన లక్ష్మీ కటంక్ష కాంతుల వోలెన్
మేని నలుపు దెలుపులతో
గానఁగనౌ గొదమ జింక కానన మందున్.

ఏమి! ఈ జింక మోమటు దిప్పుచున్నది! తన్ను జేర వచ్చు చున్న హరిణిని హరిణకపోతము వెంబడింపగా భుగ్న గ్రీవముగా దూకించు చున్నది.

వనమున నా ప్రియ గనుపిం
చెనె? హరిణీ పతి ! గురుతులు చెప్పెద వినుమీ;
ననునోగ తెలి గనులతోఁ
గనుపించును; నీ చెలి కడకన్నులు వోలెన్.

నా పలుకులను సరకు గొనక హరిణి కభిముఖమగు చుండెను. అవస్థాభేదము పరిభవాస్పదము గదా ! పరిక్రమించి పోయెదను గాక.

(చూచి) ఏమది ? శిలా ప్రదేశ మధ్యమం దరుణారుణముగఁ గనుపించుచున్నది.

హరి హరియించుచుండు హరిణామిష మియ్యది కాదుగా; ప్రభా
తరలము; వానతోఁ దడిసె ధారుణి యంతయు గాన నగ్ని సం
భరితముగా; దశోక కుసుమచ్ఛవి రంజిలు రత్న మెద్దియో;
అరుణగభస్తిమాలి తన హస్తముఁ జాచెఁ బరిగ్రహింపగన్.

అది నా మనస్సు నాకర్షించుచున్నది. తీసికొందును గాక, కాని

మధుర మందార సుమ గుచ్ఛ మధ్యమందు
సమరమణి యామె వేసలి సమరవలయు ;
నట్టి ప్రియతను లేకున్న యపుడు తీసి
తరళ బాష్పాంబు వృష్టిచే దడుపనేల?

(తెరలో) వత్సా! పరిగ్రహింపుము.

శివసతీ మంజు మంజీర శింజిత మృదు
చరణ మంజు కంజాత సంజాత మిద్ది;
తరల సంగమనీయ రత్నమ్ము సుమ్ము;
ప్రణయ సంగమ యోగ సంప్రదము లెమ్ము.

రాజు - (చెవియొగ్గి) ఎవరు న న్ననుశాసించుచున్నది? (చూచి) ఎవ్వరో మృగచారి మహానుభావుఁ డనుక అపతో న న్ననుగ్రహించు చున్నాఁడు. మహాత్మా - మీ యుపదేశమునకుఁ గృతజ్ఞుడను.

(మణిని గ్రహించి)

బాలామణితో సంగమ
లీలా సౌఖ్యమ్ముల నలరింపుము మణిరో!
బాలేందు మౌళితో సరి
పోలుచు చూడామణిగను బూనుదు నిన్నున్.

(పరిక్రమించి చూచి) ఏమి? కుసుమవిరహితమై కూడ ఈ లతన న్నాకర్షించు చున్నది. అవును నా మనస్సు రంజిల్లుట యు క్షమే. ఏలన

తొలకరి చిన్కులన్ జిగురు దోగిన తీగెలు తోచు బాష్ప బిం
దు, లధరమందు చిందు నవ తోయజ చంచలనేత్ర వోలెఁ బు
వ్వులు గనరక యాభరణ పుంజము వీడుట గండు తేటి గుం
పుల రొద లేక మౌనమునఁ బొక్కెడి కోపనవోలె దోచెడిన్.

కావున, ప్రియానురూప మైన యీ లతను గౌఁగిలించుకొనేద గాక. (అని కౌగిలించుకొనును )

(అంతట తత్ స్థానమున నూర్వశి ప్రవేశించును.)

రాజు :- (నిమీలితాక్షుఁడై స్పర్శసుఖము నభినయించును)

ప్రియతమా సుకుమార శరీర మిద్ది
స్పర్శ సౌఖ్యానుభూతి విస్పష్టమయ్యె!
కాని - కనులు విప్పినఁ గాననౌనొ లేదొ
యిట్టులే మోసపోయితి నింతవఱకు.

(కన్నులు విప్పి) అహో! నిజముగా ప్రియతమయే.

ఊర్వశి:-(కన్నీరు విడిచి) జయము జయము మహారాజునకు!

రాజు : - కల్యాణీ ! వియోగవేదనతోఁ గృశించు చున్న నాకు నీ పునస్సం దర్శనము పునరుజ్జీవనము వలె నున్నది.

ఊర్వ:- నాకు మహారాజు వృత్తాంత మంతయు విదితపూర్వమే; అయినను నేమి చేయఁగలను ?

రాజు :- నీ మాటలు నా కర్థమగుట లేదు.

ఊర్వ:- విశదీకరించెదను - కాని- ముందు కోపవశమున నిట్టి దురవస్థ తెచ్చి పెట్టిన నన్ను మహారాజు క్షమించవలెను.

రాజు : కల్యాణీ! వేఱుగ క్షమింపవలెనా ? నీ సందర్శనమే బాహ్యాంతః కరణ సంశుద్ధి గల్గించి నన్నుఁ బసన్నుఁ జేసినది నన్నెట్లు వీడియుండగలిగితివి ?

ఊర్వ:- శాశ్వత బ్రహ్మచర్య వ్రత పరిపాలన సల్పు కుమారస్వామి యీ గంధమాధన కచ్ఛమం దకలుష మను ప్రదేశ మందు నివసించుచు నొక విధి కల్పించినాఁడు.

రాజు : ఏమది ?

ఊర్వ:- ఈ ప్రదేశము ప్రవేశించిన స్త్రీ లతాభావము నొందును. గౌరీచరణరాగ సంజనిత మణి స్పర్శతో గాని యథారూపము నొందదు. నేను గురుశాప ప్రేరిత మనస్కనై, కుమారవనము ప్రవేశించి నియమోల్లంఘున గావించి లతారూపము నొందినాను.

రాజు :- అంతయుఁ దెలిసినది. ఈ సంగమనీయ ప్రభావము వలన నిన్నుఁ దిరిగి పొందఁగలిగినాను. (మణి జూపును)

ఊర్వ :- ఓహో! సంగమనీయ మణియా! స్పర్శ మాత్రమున యథా నలిగినాను. (మణిని మూర్ధముపై నుంచుకొనును)

రాజు :- సుందరీ - ముహూర్తకాల మట్లే ధరింపుము.

నీ ముఖపద్మము రాగిణి

కోమలమౌళిమణి రాగ గుంఫితమై శో

భామసృణమయ్యె నవ సం

ధ్యా మంజుల రక్త పద్మ తారుణ్యముగా.

ఊర్వ:- ప్రతిష్ఠానము వీడి చిరకాలమైనది. పౌరులు నన్ను ద్వేషించెదరు వోవుదము రమ్ము .

రాజు :- నీ యిష్టము.

ఊర్వ:- ఎట్లు వోవుదము మహారాజా !

రాజు :- జ్యోతిష్మతి యిలుఁ జేర్పుము

జ్యోతిర్మార్గాంతరాలు సుర చాపమయ

జ్యోతిర్లేఖా ధ్వజ శో

భాతేజో మృదువిమానవారిద పంక్తిన్.

\- చతుర్థాంకము -

## పంచమాంకము

(అంతట సంతోషముతో విదూషకుడు ప్రవేశించును)

విదూషకుడు:- అదృష్టవశమునఁ బ్రియ వయస్యుఁడు నందన వనాది దేవతారణ్యములలో నూర్వశితోఁ గలసి చిరకాలము విహరించి తిరిగి వచ్చినాడు. సత్కారోపచారముల నంది ప్రజానురంజ కముగా రాజ్యము సల్పుచున్నాఁడు. అనపత్యత తప్ప నతని యందు దోష మేమున్నది? ఈ నాడు తిథివిశేషమగుటచే దేవేరులతోఁ గూడి గంగా యమునా సంగమ స్నాన మాచరించి. రాజస్కంధావారము నిప్పుడే చేరినాఁడు అతఁ దనులేపన మాల్యాద్యలంకారముల ముగించుకొను నప్పటి కతనిఁ గలసికొందును.

(తెరలో)

అయ్యో! అయ్యో ! మహారాజ ప్రియ విలాసినీ మౌళి యోగ్య మైన మణి తాలవృంతాధారమున దుకూలాచ్ఛాదనముతో గొని పోవుచున్న దాని నామిషశంకచే గ్రద్ద తన్నుకొని పోయినది.

విదూ :- (చెవియొగ్గి) అత్యాహితము ఆ సంగమనీయ చూడామణి వయ స్యున కత్యంత ప్రీతి పాత్రము. అందుచే నలంకారము ముగించు కొనకుండగనే లేచి యిటు వచ్చుచున్నాఁడు. అతనిఁ జేరెదఁ గాక.

(అంతట రాజాపేగపరిజనుఁడై ప్రవేశించును.)

రాజు :- సర్వ శాసకుఁడైన రాజుగృహమునందే మణి నపహరించి యాత్మవధ నాహ్వానించుచున్న దొంగ యెవ్వరు?

కిరాతి:-ముకురకోటి సంలగ్నహేమసూత్రముతో మణిగ్రహించి నాకాశము నుల్లేఖించుచు భ్రమించు చున్న గ్రద్ద యదిగో !

రాజు :- చూచుచున్నాను.

కనక సూత్రమ్ము ముక్కునఁ గ్రాలఁ బక్షి
సలుపు మణితోడ మండల చారణముల
రాగరేఖా వలయముల వేగఁ దిరుగుఁ
జదలయందు జ్వాలాచక్ర చలనమట్లు.

కర్తవ్య మేమి ?

విదూ :- (సమీపించి) అనుకంప యేల ? అపరాధిని శిక్షింపుము.

రాజు :- సరియే ధనువు; ధనువు రెండు. (ధనుర్గ్రాహిణి యవని నిష్క్రమణము) వయస్యా! పక్షి కనుపించుట లేదు.

విదూ :-కృణప భోజనము దక్షిణాభిముఖముగాఁ బారినది.

యవని:- (చాప హస్తయై ప్రవేశించి) ఇదిగో ! శరాసనము.

రాజు :-(తిరిగిచూచి) ఇంక ధను స్సేల? పక్షి బాణపథ మతిక్రమించినది!

ఖగము గొనిపోయెడి మణి యాకసమునందు

దూరమునకు, లేపెల్లులఁ దోఁచుచుండు

తఱచు మొయిలు మాటున లోహితద్యుతులను

గ్రాలుచుండు నంగారక గ్రహమువోలె.

(కంచుకొని గాంచి) లాతవ్యా ! సాయంసమయమున నీ పక్షికై నివాస వృక్షముల గాలింపు మని నాగరకులకు నా యాజ్ఞగా జెప్పుము.

కం :- దేవర యాజ్ఞ.

విదూ : - మహారా జించుక విశ్రమించు గాక. ఎక్కడకుఁ బోయిన నా రత్న కుంభీరకమునకు నీ శిక్ష తప్పును?

(అంతట శరముతోఁ గూడిన మణితోఁ గంచుకి ప్రవేశము)

కంచుకి: - జయము జయము మహారాజునకు ఈ పక్షికిఁదగిన శాస్తి జరిగినది. మార్గణచ్ఛిన్న శరీరముతో మణితో గూడ నీపక్షి నేలఁ గూలినది.

(అందరు విస్మయము నభినయించెదరు)

కం :- ప్రక్షాళనాంతర మీ మణి నెవరి కీయవలెను?

రాజు :- కిరాతీ ! అగ్ని శుద్ధము చేసి పేటికలో నుంచుము.

కిరాతి:- దేవర యాజ్ఞ.

రాజు :- లాతవ్యా! ఈ బాణ మెవ్వరిదో గదా.

కం :- అక్షరము లేవియో గనుపించుచున్నవి గాని దృష్టిమాంద్యముచే బోల్చు కొనలే కున్నాను.

రాజు :- అయిన బాణము నిటు తెమ్ము. (కంచుకి యట్లుచేయును. రాజు నామాక్షరములఁ జదివి యపత్యత నభినయించును.)

కం :- నా నియోగము ననుసరించెదను (నిష్క్రమించును)

విడు :- ఏమి విచారించు చున్నావు ?

రాజు: విను పక్షిహంత నామాక్షరములు

ఊర్వశీ సంభవుండు నైలోద్భవుండు
చండకోదండ పాండిత్యముండితుండు
రాజ పుత్రుని యాయు నా రాచమిద్ధి
పరుల నాయువుఁ దీయ నప్రతిహతమ్ము.

విదూ :- (సంతోషముతో) సంతానవంతుఁడవు వర్ధిల్లుము.

రాజు :- మిత్రమా ! ఏమిది? నైమిశారణ్యమున సత్రయాగము జరిగి నప్పుడు దక్క నూర్వశిని విడిచి యుండలేదు. గర్భధారణమే నాకుఁ దెలియదే! కాని — యా దినములలో నామె శరీరము లవలీసుమదళ పాండురమై నయన ద్యుతులు మందగించినవి.

విదూ :- దివ్య వనితలకుఁ గూడ మానుషీలక్షణము లుండవలెనా? వారి చరిత్ర నిగూఢ ప్రభావోపేతము.

రాజు :- కావచ్చును, పుత్రసంవరణమునకు గారణ మేమై యుండును?

విదూ :- దేవతా రహస్యము లెవ రూహింపఁ గలరు.

కం :- (ప్రవేశించి) జయము జయము మహారాజునకు. తాపసి చ్యవనా శ్రమ నివాసిని కుమారునొకనిఁ దోడ్కొని దేవర సందర్శింప గోరుచున్నది.

రాజు ;- సత్వరము ప్రవేశ పెట్టుము.

కం :- దేవర యాజ్ఞ (అని నిష్క్రమించి చాపహస్తుఁడు కుమారునితోఁ దాపసితోఁ దిరిగి ప్రవేశించును.)

కం :- భగవతీ - ఇటు; ఇటు;

విదూ :- ఆర్థి నారాచముచే గ్రద్దను గూల్చిన క్షత్రియకుమారుఁ డితఁ డేనా ? అచ్చుమచ్చు నిన్నుఁ బోలుచున్నాడు.

రాజు :- అవును అందుచేతనే

కన్నులు చెమ్మగిల్లె సుతుఁ గాంచుట తోడనె ప్రేమరాగ సౌ
ఖ్యోన్నతి గుఁడెలో నుబుకుచున్నది మానసమున్ బ్రశాంతమై
యున్నది పుల్కరించుచు మహోత్సుక గాఢతఁ గౌగిలించి మూ

ర్కొన్ననుగాని నా కెటుల నూరట గల్గును నెమ్మి నమ్మునన్.

కం :- భగవతీ ! ఇచ్చట నుండుము (తాపసి కుమారునితోఁ గలసి కూర్చొనును)

రాజు :- అమ్మ !- అభివాదాలు.

తాపసి:- మహారాజా ! సోమవంశ వర్ణనుఁడవు గమ్ము. (ఆత్మగతము)

రాజర్షి యాయువునకుఁ గల యౌరససంబంధము చెప్పకయే స్వయం వ్యక్త మగుచున్నది.

(ప్రకాశముగ) కుమారా ! పితృ దేవునకు నమస్కరింపుము.

కుమారుఁడు:- (చాపగర్భముగ నంజలి ఘటించును)

రాజు :- ఆయుష్మంతుఁడవు గమ్ము.

కుమా :- (ఆత్మగతము)

పుత్రుఁడ నని తెలియగ నపూర్వమైన
యార్ద్ర వాత్సల్య గంధమ్ము లలము కొనియె!
బిడ్డ నొడిలోన లాలించి పెంచినట్టి
తండ్రిపై నుండు ప్రేమమ్ము తరమె తెలియ.

రాజు :- భగవతీ ! భవదీయాగమన ప్రయోజన మేమి ?

తాపసి:- వినుము మహారాజా ? ఈ దీర్ఘాయువు నాయుపు నూర్వశి కార ణాంతరములచేఁ బుట్టిన వెంటనే నా కప్పగించినది చ్యవన మహర్షి యతనికి క్షత్రియ కుమారోచితమైన జాత కర్మాది విధుల నిర్వర్తించి, విద్యాభ్యాసానంతరము ధనుర్వేదముఁ గఱపెను.

రాజు :- ఉత్తమ సంరక్షకుని ప్రాపునఁ బెరిగినాడు

తాపసి:- ఈనాడుఁ బుషి కుమారకులతోఁ బుష్పసమిత్కుశార్థ మరిగి యా శ్రమ విరుద్ధ మాచరించినాఁడు.

విదూ :- (ఆత్మగతము) ఏమది ?

తాపసి:- మాంసపుముద్దఁ దన్నుకొని వృక్షాగ్రము చేరిన గ్రద్దను బాణముతోఁ బడ గొట్టినాఁడట!

(విదూషకుఁడు రాజుపై దృష్టి సారించును)

రాజు :- తరువాత?

తాప : - యావద్వృత్తాంతము విని, చ్యవన మహాముని కుమార న్యాసము తిరిగి యొప్పగింపుమని యాదేశించినారు. కావున దేవి యూర్వశిఁ జూడఁ గోరుచున్నాను.

రాజు :- భగవతి ఈ యాసన మలంకరించుఁ గాక (తాపసి యుపనీ తాసన మలంకరించును) లాతవ్యా! యూర్వశిని రమ్మని చెప్పుము.

కం :- దేవర యాజ్ఞ (అని నిష్క్రమించును)

రాజు :- (కుమారుని గాంచి వత్సా, యిటురమ్ము .

సుందర రాకాజ్యోత్స్న

నందము కర్పూర చందనపు లేపనముల్

నందన వదన సరోరుహ

సందర్శన భాగ్యమునకు సరి రావు గదా.

తాపసి:- పితృదేవునకు సంప్రీతి ఘటింపుము వత్సా!

(కుమారుఁడు రాజును సమీపించి పాదముల కెరగును)

రాజు :- (కుమారుఁ గౌగిలించుకొని పాదపీఠమున నాసీను గావించి)

వత్సా! పితృసఖుఁ డీ బ్రాహ్మణునకు నమస్కరింపుము.

విదూ :- శంక యేల ? ఆశ్రమ వాసములో శాఖామృగములతోఁ బరిచయ మున్నదిగదా ?

కుమా : - (నవ్వుచు) ఆర్యా ! వందనములు.

విదూ :- స్వస్తి !

(అంతట నూర్వశి యుఁగంచుకియుఁ బ్రవేశించెదరు)

కం :- ఇటు; ఇటు దేవీ ;

ఊర్వ: - (కుమారుఁ గాంచి, మహారా జలుకలు దువ్వ పాదపీఠము పై చాప హస్తుఁడై యాసీనుఁడైయున్న యీ కుమారుఁ డెవ్వడు? (తాపసిఁ గాంచి) ఓహో ! నా కుమారుఁడే. సత్యవతి ప్రక్క నున్నది. పెంచి పెద్దవానిఁ

జేసినది.

తాప :- బిడ్డా ! నీ మాతృదేవి కెదురేగి నమస్కరింపుము.

(కుమారుఁ డూర్వశి కెదురేగును)

కుమా :- తల్లీ ! పాద ప్రణామములు

తాప :- భర్తృ బహుమానము బొందుము.

కుమా :- అమ్మా ! అభివాదములు.

ఊర్వ:- (కుమారు నెత్తుకొని కౌగిలించుకొని) కుమారా ! పితృదేవు నారా ధించువాఁడవుగమ్ము.

(రాజును సమీపించి) జయము జయముమహారాజునకు

రాజు :- స్వాగతము పుత్రవతీదేవికి ! అని (యర్ధాసన మొసంగును)

(ఊర్వశి యుపవిష్ట యగును. అందఱు యథోచితాసనముల నలంకరించెదరు)

తాప :- ఆయువు విద్యాగృహీతుఁడై కవచధారణ సమర్థుఁ డయినాఁడు. భర్తృసమక్షముననే న్యాసీకృతుడైన నీ కుమారుని నీ కప్పగించు చున్నాను. నా యాశ్రమ ధర్మనిర్వహణకై పోయెదను. సెలవు.

ఊర్వ:- నిన్నుఁ జూచి చాలఁ గాలమైనది. చూచినటులే లేదు. కాని నిన్నాపుట ధర్మము కాదు. పోయిరమ్ము పునర్దర్శన మగుగాక.

రాజు :- చ్యవన భగవానులకు నా ప్రణిపాతము లందఁ జేయుము.

తాప : - అట్లే !

కుమా :- ఆర్యా! నీవు నిజముగా నాశ్రమమునకుఁబోపుచున్నచో నన్నుఁ గూడ దీసికొని పొమ్ము,

రాజు :- నాయనా ! ప్రథమాశ్రమము దాటినావు. ద్వితీయాశ్రమ ధర్మములింక నెఱప వలయును.

తాప :- తండ్రీ! గురువచనానుసారము నడచుకొనుము.

కుమా :- అవును గాని

సెమలి కొదను తలపై నే

నిమురుచు నుండంగఁ జెందు నిద్రాసుఖమున్

నా మణికంఠకశిఖి పిం

చెము పెంచినయంత నన్నుఁ జేర్పుము మరలన్,

తాప :- అట్లే చేర్చెదను మీ కందఱకు స్వస్తి! (అని నిష్క్రమించును)

రాజు :-కళ్యాణీ! నాకీనాఁటి కనపత్యదోషము తొలఁగినది. పురందరునకుఁ బౌలోమి వలన జయంతుఁ డుద్భవించిన ట్లీ పుత్రుఁడు నీవలన నా కుదయించి పుత్రవంతులలో న న్న గ్రగణ్యుని సల్పినాఁడు.

(ఊర్వశి జ్ఞప్తి నెలయించి కన్నీరు గార్చును).

విదూ :- ఈ పూజ్యురా లేల యున్నట్టు లుండి కన్నీరు గార్చుచున్నది.

రాజు :- ఈ నిష్కారణావేగ మేల?

ఊర్వ:- మహారాజా ! వినుము, అసలు విషయము పుత్ర సందర్శనముచే మఱచినాను. కాని యిప్పు డింద్ర నామస్మరణముచే నాతని యనుశాసనము జ్ఞ ప్తికివచ్చి నాహృదయ మారాటము చెందినది.

రాజు :- మహేంద్రానుశాసన మేమి ?

ఊర్వ :- "నామిత్రుఁడు రాజర్షి వంశాంకుర వదనము తిలకించినప్పుడిక నీవు తిరిగి స్వర్గమును జేరు"మని మహేంద్రుని యాజ్ఞ. కావున భవద్వియోగ భయముచే జాతమాత్రుని విద్యా బుద్ధులు పొందు టకై చ్యవన మహర్షి యాశ్రమమునఁ దాపసి సత్యవతి కప్పగించి నాను ఆమె విద్యాసంపన్ను బుత్రు దిరిగి యప్పగించినది. ఇదియే యిక నా కడసారి వీడ్కోలు.

రాజు :- అయ్యో ! దైవము సౌఖ్యము నోర్వ, జాలదు గదా

పుత్రలాభ సంతోషమ్ము పొందునంతఁ

బ్రేయసీ వియోగమ్ము ప్రాప్తించె నకట !

ప్రథమ వృష్టికి నాతపబాధ తొలఁగు

చెట్టు పైఁ బిడుగు పడిన యట్టు అయ్యే !

విదూ :- అదృష్ట మనర్థ పరంపరలకు దారి తీసినదే. ఇక మహారాజు వల్కల ధారియై తపోవనమునకుఁ బోవుట మంచిది.

ఊర్వ :- మహారా జేసుని యెంచినను నేనే మందభాగినిని, విద్యాసంపన్ను డైన పుత్రుని వదలి స్వర్గమునకుఁ బోవక

తప్పదు.

రాజు :- కాదు కాదు. నీవు స్వతంత్రవు కావు. నీ ప్రభుశాసన మనుస రించుట నీ ధర్మము. నేనుఁ గూడ రాజ్యభారము నాయువుపైఁ బెట్టి మృగ యూధములతోఁ బాటు తపోవనమున నివసించెదను.

కుమా :- తండ్రీ ! వృషభపుంగము మోయవలసిన భారము లేఁత కోడె దూడ పై మోపుట యుచితము గాదు.

రాజు :- వత్సా !

గజముల నెల్ల లో (గొనును గంధగజమ్ము కిశోర మైననున్

భుజగము చిన్నదయ్యు విషమున్ బ్రసరించును వేగధారగా;

బ్రజలను నేలఁగల్గును బరాక్రమవంతుఁడు రాజు బాలుఁడై ;

స్వజవన సత్వముల్ సహజ శక్తులుగాని వయస్సు హేతువే?

లాతవ్యా ! ఆమాత్య పరిషత్తుతో నాయువునకుఁ రాజ్యాభిషేక సన్నాహముల సమకూర్చుమని దెల్పుము.

కం :- దేవర యాజ్ఞ (అని దుఃఖముతో నిష్క్రమించును)

(అందఱు కన్నులు మిరుమిట్లు గొల్పుట నభినయింతురు)

రాజు : - (ఆకాశమునకు దృష్టి సారించి) మేఘములు లేని యీ మెఱపుల గుంపులేమి?

ఊర్వ :- (చూచి) ఓహో ! నారద భగవానులు !

రాజు :- అవును. నారద భగవానులే !

పింగళ జాట జూటా

సంగు డు జాబిల్లి వంక జన్నిద మొప్పన్

బంగరుడలు మొలిచిన

జంగమ కల్పలతవోలె చకచక వచ్చెన్.

అర్ఘ్యపాద్యాదులు నిటు తెండు.

ఊర్వ:- (యథో క్త మాచరించి పూజాద్రవ్యము లివిగో !

(అంతట నారదుఁడు ప్రవేశించును)

నారద : - మధ్యమలోక పాలకునకు జయ మగుఁగాక,

రాజు :- ఊర్వశి హస్తములనుండి యర్ఘ్యము గైకొని యొస(గి) మహానుభావా ! అభివాదములు.

ఊర్వ:- వందనము.

నార : - ఎడ బాయని దంపతులగుదురు గాక !

రాజు : - (ఆత్మగతము) ఇది నిజమగునా? (ప్రకాశముగ) వత్సా! మహర్షి కభివాదములు సల్పుము.

కుమా:- భగవానుఁడా! ఔర్వశేయుఁ డాయువు నమస్కరించుచున్నాఁడు.

నార:- దీర్ఘాయువు గమ్ము .

రాజు :- ఈ యాసన మలంకరింపఁ బ్రార్థన, నారదుఁ డుపవిష్టుడగును. అందఱు తరువాతఁ గూర్చుందురు)

నార ; - మహారాజా ! మహేంద్ర సందేశము వినుము.

రాజు :- అవహితుఁడను.

నార ;- ప్రభావదర్శియైన మహేంద్రుడు తపోవన వాసమున కేగు నీ సంకల్ప మెరింగి చెప్పున దేమన

రాజు :- ఏమి యాజ్ఞ.

నార :- త్రికాలజ్ఞులైన మునులు త్వరలో సురాసుర సంగ్రామము జరుగు నని తెల్పుచున్నారు. నీవా మాకు రణ సహాయుఁడవు. కాన నిపు డస్త్ర సన్న్యాసము చేయఁ దగదు. ఊర్వశి నీ జన్మ సహ ధర్మచారిణియై యుండఁగలదు.

ఊర్వ:- (అపవారించి) నా హృదయ శల్యము పెకలింప బడినది.

రాజు :- దేవేంద్రునకు సదా కృతజ్ఞుఁడను.

నార :- యుక్తమే.

ఇంద్రు,డిచ్చెడి నీకు నభీష్టములను
నీవు నింద్రుని వాంఛ లీడేర్చవలయు;
అగ్ని సూర్యున కిచ్చెడి యాతపమ్ము
సూర్యుఁ డగ్నికి నిచ్చు దేజోవివృద్ధి

(ఆకసము వంకకుఁ జూచి)

రంభ-మహేంద్రుఁడే వాయువు యౌవరాజ్యాభిషేకమునకై స్వయముగా సమకూర్చిన సంభారముల నిటుదెమ్ము

(అంతట యథో క్త హస్త యై యప్సరస ప్రవేశము)

అప్సరసలు:- ఇవిగో! అభిషేక సంభారములు.

నార :- భద్రపీఠమున నాయుష్మంతుఁడాసీనుఁ డగుత!

రంభ:- వత్సా! యిటురమ్ము (అని యాసీనుఁగావించును.)

నార :- (కుమారుని శిరస్సుపైఁ గలశజల మభిషేకించి) రంభా! శేష విధులు నిర్వర్తింపుము.

రంభ:- వత్సా! మహానుభావుఁడు మహర్షికి, మాతాపితలకుఁ బ్రణ మిల్లుము.

(కుమారుఁడు యథాక్రమముగ బ్రణమిల్లును )

నార:- చిరంజీవీ ! స్వస్తి!

రాజు :- కుల ధురంధరుఁడవు గమ్ము! వత్సా!

ఊర్వ:- పితృదేవు నారాధించువాఁడవు గమ్ము!

(తెరలో వైతాళికులు)

ప్రథముడు:-

బ్రహ్మ కత్రి; యత్రికిని జంద్రముఁడు చంద్రు
నకును బుధుఁడును నా బుధునకును రాజ
ఋషి పురూరవప్రభు వోలె నీవు గూఁడ,
దగిన సుతుఁడవు గమ్ము నీ తండ్రి కిపుడు.

ద్వితీయుడు :-

ఉన్నతులందు నీ జనకుఁ డున్నతుడై వెలుగొందు; ధైర్య సం
పన్నుఁడ నీవుఁగూడ; నొకవైపు హిమాద్రి మరొక్కవైపు వా
రాన్నిధి శోభ గూర్పగను రంజిలు గంగను బోలి రాజ్య తే

జోన్నతి వెల్లుగాత ఉభయోజ్జ్వల కీర్తి వికాస హేతువై.

అప్స :- (ఊర్వశిని సమీపించి) పుత్రయౌవరాజ్యాభి షేక సంతోషముతో భర్తృ వాల్యభ్యముతో వర్ధిల్లుము.

ఊర్వ:- ఈ సంతోషము మనకెల్లరకు సమానమే (కుమారుహస్తముతో గ్రహించి) వత్సా! మీ పెదతల్లిగారికి వందనము లర్పింపుము.

రాజు :- ఆగు నాయనా! మన మందరము కలసియే దేవి కడ కరుగుదము

నార :- కుమారుని యౌవరాజ్యాభిషేకము కుమారస్వామి దేవసేనాభి షేకము తలపింపఁ జేయుచున్నది.

రాజు :- తమ యనుగ్రహమునకుఁ బాత్రుఁడయిన వాని కేమిలోటు ?

నార :- పాకశాసకుఁడు నీకిం కే ప్రియ మాచరింపవలెను ?

రాజు :- మహేంద్రుని ప్రసన్నతకంటె నే కోరదగిన దేమున్నది? అయిన నిట్లగు గాక !

భతరవాక్యము

ఏక సంశ్రయ దుర్లభాలోక గతులు
సహజవైరుధ్యమున్ వీఁడి సరసరీతి
నెపుడు లక్ష్మీ సరస్వతు లేక మౌచు
సత్పురుషులందు గూడి ప్రసన్న లగుత!